ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు

TGTEL/25/A1132

మానవాళికి

# జనంవార్త

ప్రతి అక్షరం.. జనం కోసం..


'జనంవార్త'
మీ వ్యాపార, ఉద్యోగ, రాజకీయ, వివాహ, జన్మదిన తదితర ప్రకటనల కోసం సంప్రదించండి...
సెల్ : 8522 055 889

మేడ్చల్ | ఆదివారం | 28.06.2026 | సంపుటి : 1 | సంచిక : 348 | పేజీలు : 8 | వెల : 2/- | ఎడిటర్: దూసరి రవీందర్ గౌడ్



### నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 135 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 162 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 251 (కిలో) |
| స్కిన్ లెస్ | 284 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹88



## ముంబైలో భారీ ఉగ్రకుట్ర భగ్నం

### విషపు గుళికల పంపిణీని భగ్నం చేసిన పోలీసులు

ముంబై, జూన్ 27 : ముంబై పోలీసులు తాజాగా భారీ కుట్రను భగ్నం చేశారు. మొహర్రం ఊరేగింపు సందర్భంగా ప్రజలకు ఎలుకల మందు నింపిన విషపు గుళికలు పంపిణీ చేసేందుకు ప్రయత్నించిన ఒక వ్యక్తిని

-మిగతా 2 లో..

## నేడు పల్స్ పోలియో

### 36.10 లక్షల మంది చిన్నారులకు చుక్కలు..

### రాష్ట్రంలో 22,979 బూత్‌లు



హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం నుంచి పల్స్ పోలియో కార్యక్రమం ప్రారంభం కానుంది. 0--5 ఏళ్లలోపు 36.10 లక్షల మంది చిన్నారులకు రెండు చుక్కల బైవేలెంట్ ఓరల్ పోలియో వ్యాక్సిన్ వేయనున్నారు. ఆదివారం బూత్‌లలో, జూన్ 29--30 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి మిగిలిపోయిన పిల్లలకు టీకా అందిస్తారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లో

-మిగతా 2 లో..

## ముగ్గురు సిఎంలు ఏం మాట్లాడుకున్నారు?

### ఆ చీకటి ఒప్పందం ఏమిటో ప్రజలకు చెప్పండి

### తెలంగాణ హక్కులుకు భంగం వాటిల్లేలా రేవంత్ నిర్ణయాలు

### మరోమారు విమర్శలు గుప్పించిన హరీష్ రావు



02



## గోదావరి వరదలపై అప్రమత్తం కండి

### గతానుభవాలతో ముందస్తు నష్టనివారణ చర్యలు

### పుష్కరాల సందర్భంగా గోదావరి తీరం పరిశుభ్రంగా ఉండాలి

### అధికారులతో సమీక్షలో మంత్రి తుమ్మల ఆదేశాలు

భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 27 : గోదావరి వరదల వల్ల ప్రజానష్టం, పంట నష్టం లేకుండా సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. గోదావరి పరివాహక ప్రాంతం భద్రాచలం, పినపాక నియోజకవర్గాల్లో వరదల పట్ల జిల్లా యంత్రాంగాన్ని సన్నద్ధం చేశామని తెలిపారు. కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గోదావరి వరదల నేపథ్యంలో ముందస్తు ప్రణాళికపై శనివారం జిల్లాస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. వరదల సమయంలో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. గోదావరి వరదల సన్నద్ధతపై ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావేశంలోపల సూచనలు

-మిగతా 2 లో..

# జూలై 15న ఉద్యోగుల కొత్త ఆరోగ్య పథకం



### వారం రోజుల్లో సమగ్ర నిబంధనలు విడుదల

### భార్య, భర్త ఉద్యోగులైతే ఒకరినుంచే చందా వసూలు

### ఈహెచ్‌సీటీ తొలి సమావేశంలో నిర్ణయాలు

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య పథకం వచ్చేనెల 15 నుంచి పూర్తిస్థాయిలో అమలు చేయాలని ఎంప్లాయీస్ హెల్త్‌కేర్ ట్రస్టు (ఈహెచ్‌సీటీ) నిర్ణయించింది. శనివారం సచివాలయంలో ఈహెచ్‌సీటీ తొలి సమావేశం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆరోగ్య పథకం అమలు, నిబంధనలు, విధివిధానాలపై చర్చ జరిగింది. ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్‌ఎస్) అమలు, నిబంధనలు, చందా వసూలు, తదితర అంశాలపై ట్రస్టు సభ్యులు సుదీర్ఘంగా చర్చించారు. నిబంధనలను వారం రోజుల్లో ఖరారు చేయాలని ట్రస్టు సభ్యు లు నిర్ణయించారు.

హైదరాబాద్, జూన్ 27 : ఉద్యోగుల ఆరోగ్య పథకంలో ఉద్యోగి వాటా విషయంలో కొన్ని రోజులుగా నెలకొన్న సందిగ్ధానికి తెరదించారు. భార్య, భర్త ఇద్దరూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులైతే కేవలం ఒకరి నుంచి మాత్రమే చందా వసూలు చేయాలని, మరొకరికి మినహాయింపు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. వారం రోజుల్లో హాస్పిటల్ యాజమాన్య ప్రతినిధులతో వైద్య, ఆరోగ్య శాఖ

-మిగతా 2 లో..



## ప్రపంచాన్ని ఆకర్శిస్తున్న తెలంగాణ రైజింగ్

### నైపుణ్యాభివృద్ధి ద్వారా పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలు

### ఎక్స్ వేదికగా సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి

**హైదరాబాద్, జూన్ 27 :** తమ ప్రభుత్వం చేపట్టిన 'తెలంగాణ రైజింగ్' విజన్ దేశీయ, అంతర్జాతీయ సంస్థల దృష్టిని ఆకర్షిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని యువతకు నైపుణ్యాభివృద్ధి ద్వారా పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. తెలంగాణలో శిక్షణ పొందిన యువతకు ప్రముఖ బహుళజాతి సంస్థల్లో ఉద్యోగాలు లభిస్తున్నాయని వివరించారు. ఈ మేరకు సీఎం ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ఇటీవల జరిగిన నియామకాల్లో ష్నైడర్ ఎలక్ట్రిక్ సంస్థలో 47 మంది యువకులు ఉద్యోగాలు పొందారని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. పుణెలోని టాటా మోటార్స్ యూనిట్‌లో 36 మంది విద్యార్థులు ఎంపికయ్యారని చెప్పుకొచ్చారు. అలాగే ఫాక్స్‌కాన్ సంస్థకు చెందిన ఆపిల్ ఐఫోన్ విభాగంలో 14 మంది మహిళా విద్యార్థినులు ఉద్యోగాలు

-మిగతా 2 లో..

## సర్ కార్యక్రమాన్ని సీరియస్‌గానే తీసుకోవాలి



### అర్హుల ఓట్లు తొలంగించకుండా చూసుకోవాలి

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

రంగారెడ్డి, జూన్ 27 : కార్యకర్తలే కథానాయకులై కదం తొక్కితే ప్రతి బూత్‌లో బీఆర్ఎస్ పార్టీకే మెజారిటీ వస్తదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం,ఎస్ఐఆర్ కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని కార్యకర్తలు అత్యంత సీరియస్‌గా తీసుకోవాలన్నారు. అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని దిశానిర్దేశం చేశారు. డిజిటల్ రూపంలో పార్టీ సభ్యత్వ నమోదును పెద్దఎత్తున విజయవంతం చేయండిప్రతి కార్యకర్తకు పార్టీ తరఫున ప్రత్యేక గుర్తింపు కార్డును ఇస్తామన్నారు. ఈ గుర్తింపు కార్డుతో కార్యకర్తలు ఎక్కడికెళ్లినా గౌరవం

-మిగతా 2 లో..



## పౌరసత్వానికి, పాస్‌పోర్టుకు తేడా తెలియదా?

### బాధ్యతాయుత పదవిలో ఉన్న ఎంపి ఇలాగేనా వ్యాఖ్యలు

### అసదుద్దీన్ వ్యాఖ్యలపై మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్, జూన్ 27 :ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ భారత పాస్‌పోర్టులు, పౌరసత్వంపై ఇటీవల చేసిన వ్యాఖ్యలు చట్టపరంగా తప్పుదారి పట్టించేవిగా ఉన్నాయని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఒక ప్రజాప్రతినిధిగా, న్యాయవాదిగా ఉన్న అసదుద్దీన్‌కు పాస్‌పోర్టుకు, పౌరసత్వానికి మధ్య ఉన్న చట్టపరమైన తేడాలు తెలిసి ఉండాలని ఆయన హితవు పలికారు. రాజ్యాంగ

-మిగతా 2 లో..

## ఆర్టీసీ కార్మికుల హామీలను నెరవేరుస్తున్నాం

### వాస్తవాలను వక్రీకరించే ప్రయత్నం తగదు

### మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టీకరణ

తెలంగాణ ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన ప్రతి హామిని అమలు చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. శనివారం ఉదయం మీడియాతో మాట్లాడుతూ... 32 డిమాండ్లలో 29 పరిష్కారానికి చర్యలు పూర్తి అయ్యాయన్నారు. 11శాతం పీఆర్సీ జులై జీతాల నుంచే అమలు చేయనున్నట్లు తెలిపారు. గుర్తింపు సంఘాల ఎన్నికలను త్వరలో నిర్వహిస్తామన్నారు. విలీన కమిటీలో కార్మిక ప్రతినిధులకు చోటు కల్పిస్తామని చెప్పారు.



హైదరాబాద్, జూన్ 27 : గుర్తింపు సంఘం ఎన్నికల తర్వాతే విలీన కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. విలీన పక్రియపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు వెళ్తుందన్నారు. కార్మికులను తప్పుదోవ పట్టించే ప్రచారాలను నమ్మొద్దన్నారు. ఎన్నికల నోడల్ అధికారిగా జేఎల్‌సీ సునీత నియామకం జరిగిందన్నారు. ఏపీ తరహా ఇబ్బందులు రాకుండా విలీన విధివిధానాలను రూపొందించనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్

-మిగతా 2 లో..

## ప్రపంచాన్ని ఆకర్శిస్తున్న తెలంగాణ రైజింగ్

(మొదటిపేజీ తరువాయి)

సాధించారని తెలిపారు. బ్లూ కాలర్ ఉద్యోగాల రంగంలో తెలంగాణను దేశానికే కేంద్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వం ముందుకు సాగుతోందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు శిక్షణ అందిస్తూ, ఉద్యోగ కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వెల్లడించారు. తెలంగాణలో అందుబాటులో ఉన్న నైపుణ్యవంతమైన మానవ వనరులు, పారిశ్రామిక అనుకూల విధానాలు, మెరుగైన మౌలిక వసతులు ప్రపంచస్థాయి సంస్థలను ఆకర్షిస్తున్నాయని సీఎం తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని అంతర్జాతీయ కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టి ఉపాధి అవకాశాలు కల్పించే అవకాశముందని సీఎం రేవంత్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.



## సర్ కార్యక్రమాన్ని సీరియస్‌గానే తీసుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

లభిస్తదన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల యుద్ధానికి? ఇప్పటి నుంచే పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మహేశ్వరంలో బీఆర్ఎస్ కార్యకర్తల జోష్ చూస్తుంటే.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిచిపోయిన భావన కలుగుతోం దని.. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అయిపోయారని అనిపిస్తోందన్నారు. మహేశ్వరం లో మరోసారి సబితమ్మ గెలుపు తథ్యమని తేలిపోయింది. అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడొ చ్చినా.. కాంగ్రెస్ బంగాళాఖాతంలో కలిసేది పక్కా. బ్రహ్మాండంగా బీఆర్ఎస్ గెలిచేది పక్కా.. రాష్ట్రంలో గులాబీ జెండా ఎగిరేది పక్కా తెలంగాణ నలుదిశలా ఒకే నినాదం మారుమోగుతోంది. అదే కాంగ్రెస్ పోవాలె.. కేసీఆర్ రావాలే. రాష్ట్రంలో వికాసం పోయింది.. విధ్వంసం, విషాదం మాత్రమే మిగిలిందన్నారు. కేసీఆర్ కిట్ పోయింది.. కరెంటు కోతల కాలం వచ్చింది.రైతుబంధు పోయింది.. రాహుల్ బంధు వచ్చింది. రాష్ట్రంలో సంక్షేమ పథకాల పాతర.. కుంభకోణాల జాతర నడుస్తోంది. సీఎంగా రేవంత్ ఉన్నా.. ప్రజలు కేసీఆర్ తలుచుకుంటున్నరని కేటీఆర్ గుర్తు చేశారు. తెలంగాణలో ఉద్యమంలో మహేశ్వరం ముద్దుబిడ్డ సిరిపురం యాదయ్య ఓయూ వద్ద రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేశారు. ఎంతోమంది అమరవీరుల త్యాగాల స్ఫూర్తితోనే.. పదేళ్ల పాలన సాగింది. ప్రజాసంక్షేమం.. ప్రగతిపథం.. రెండు జోడెద్దులా ముందుకు సాగాయి. ఇవాళ బీఆర్ఎస్ ఓడిపోవడం వల్ల ఎవరు నష్టపోయారో ఆలోచించండి. కేసీఆర్‌కు పదవులు కొత్త కాదు. ఎన్నో పదవులను త్యాగం చేశారని.. 50 సంవత్సరాల సుదీర్ఘ అనుభవం కేసీఆర్ సొంతం కేటీఆర్ పేర్కొన్నారు.



## గోదావరి వరదలపై అప్రమత్తం కండి

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని జిల్లాను పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. కొన్ని ప్రాంతాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గత వరదల అనుభవాలను పరిగణలోకి తీసుకుని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయం చేసుకోవాలని దిశానిర్దేశర చేశారు. వరదల వల్ల రహదారులు బ్లాక్ అయ్యే గ్రామాలను గుర్తించాలని సూచించారు. అత్యవసర వైద్యసేవలు, నిత్యావసర వస్తువుల రవాణాకు అడ్డంకులు లేకుండా యాక్షన్ ఎ÷-లాన్ ఉండాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పారిశుధ్య పనులను ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు. తాగునీరు, వైద్యం వంటి అత్యవసర సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ సమీక్షకు ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, ఐటీడీఏపీఓ రాహుల్, మేయర్ మూడ్ గణెలిశ్, ప్రభుత్వ శాఖల అధికారులు హాజరయ్యారు.

## ముంబైలో భారీ ఉగ్రకుట్ర భగ్నం

(మొదటిపేజీ తరువాయి)



అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి 14,900 విషపు గుళికలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని ఫయాజ్ ప్రేమ్‌జీగా గుర్తించారు. అతడు పుణెలోని విమాన్ నగర్ ప్రాంతంలో ఉంటున్నాడని చెప్పారు. పెయింట్ షాపు నిర్వహిస్తాడని తెలిపారు. నిందితుడు కొన్ని రోజులుగా ముంబైలోని డోంగ్రీ ప్రాంతంలోని ఒక డార్మిటరీలో ఉంటున్నట్టు పోలీసులు గుర్తించారు. జేజే, బైకుల్లా ప్రాంతాల మీదుగా మొహర్రం ఊరేగింపు వెళుతున్న సమయంలో నిందితుడు అక్కడున్న వారికి విషపు గుళికలను పంచే ప్రయత్నం చేసే సమయంలో అతడిని అదుపులోకి తీసుకున్నారు. మొత్తం 30 వేల గుళికలను రెడీ చేసేందుకు ఫయాజ్ ప్రయత్నించినట్టు పోలీసులు గుర్తించారు. 2019-25 మధ్య కాలంలో అతడు పలుమార్లు ఇరాన్, ఇరాక్‌లను సందర్శించినట్టు కూడా పోలీసుల దర్యాప్తులో బయటపడింది. గతేడాదే అతడు ఏకంగా 19 సార్లు ఇరాన్, ఇరాక్‌లకు వెళ్లివచ్చాడు. ఈ పర్యటనల వెనక అతడి ఉద్దేశం ఏమిటో, దీని వెనుక మరేదైనా పెద్ద నెట్‌వర్క్ ఉండవచ్చనే అనే కోణంలో విచారణ జరుపుతున్నారు. ఫయాజ్ సోదరి ప్రస్తుతం ఇరాన్‌లో ఫిజియోథెరపిస్టుగా పనిచేస్తోంది. అతడి తల్లి కూడా ఇరాన్‌లోనే ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. ఫయాజ్ డైవర్సీ అని కూడా చెప్పారు. అతడి మొబైల్ ఫోన్ రికార్డులు, బ్యాంక్ లావాదేవీలపై వారు దృష్టిసారించారు.

# ఆర్టీసీ కార్మికుల హామీలను నెరవేరుస్తున్నాం

(మొదటిపేజీ తరువాయి)

పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తోందని రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. కొంతమంది కార్మిక సంఘాల నాయకులు వాస్తవాలను వక్రీకరిస్తూ కార్మికులను, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం బాధాకరమని ఆయన అన్నారు. ఆర్టీసీ సమ్మె సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రులు పొన్నం ప్రభాకర్ , శ్రీధర్ బాబు, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో లతో కలిసి చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు తో పాటు సీనియర్ ఐఏఎస్ అధికారులు, ÷నాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వికాస్ రాజ్, లేబర్ అండ్ ఎంప్లాయిమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ దానా కిషోర్ , ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి ,ఇతర ఆర్టీసీ ఉన్నతాధికారులు, ప్రతి కార్మిక సంఘం నుంచి ఇద్దరు చొప్పున దాదాపు 30 మంది కార్మిక సంఘాల ప్రతినిధులతో సుదీర్ఘంగా 14 గంటల పాటు చర్చించి అందరి ఆమోదంతో ఏకగ్రీవ నిర్ణయాలు తీసుకున్నామని మంత్రి గుర్తుచేశారు. సమావేశంలో మొత్తం 32 డిమాండ్లలో 29 అంశాలు ఆర్టీసీ యాజమాన్యం పరిధిలో, మూడు అంశాలు ప్రభుత్వ పరిధిలో ఉన్నట్లు నిర్ణయించడం జరిగిందన్నారు. యాజమాన్యం పరిధిలో ఉన్న 29 అంశాల పరిష్కారానికి ఈడి ల కమిటీ ద్వారా ఇప్పటికే చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పరిధిలో ఉన్న మూడు కీలక అంశాలైన ఆర్టీసీ గుర్తింపు సంఘాల ఎన్నికలు, 2021 పీఆర్సీ, ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం.పీఆర్సీ విషయంలో ప్రభుత్వం ప్రకటించిన 11 శాతం జూలై నెల జీతాల నుంచే అమల్లోకి రానుందని తెలిపారు. ఆర్టీసీ కార్మికుల మొదటి డిమాండ్ ఆర్టీసీ గుర్తింపు సంఘాలు ఎన్నికలు అని ఇప్పుడు మాట



మార్చి ప్రజలను,కార్మికులను పక్కదోవ పట్టించడం సరికాదన్నారు. ఆర్టీసీ విలీనానికి సంబంధించి విధివిధానాలు రూపొందించే అధికారుల కమిటీలో కార్మిక ప్రతినిధులు తప్పనిసరిగా ఉండాలని సమావేశంలో కార్మికులు ఏకగ్రీవంగా నిర్ణయించారని మంత్రి పేర్కొన్నారు. అయితే ఆ కమిటీలో ఉండే కార్మిక నాయకులు గుర్తింపు పొందిన సంఘం నుంచి ఉండాలంటే ముందుగా గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించాలనే నిర్ణయం అందరి సమక్షంలో తీసుకున్నామని వెల్లడించారు. దీనిలో భాగంగానే ప్రభుత్వం ఇప్పటికే గుర్తింపు సంఘాల ఎన్నికల పక్రియను ప్రారంభించిందని, లేబర్ జాయింట్ కమిషనర్ సునీతను ఎన్నికల నోడల్ అధికారిగా నియమించినట్లు తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసి త్వరలోనే గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించే దిశగా వెరిఫికేషన్ పక్రియ కొనసాగుతుందని చెప్పారు. కార్మికుల ప్రయోజనాలను కాపాడేందుకే ముందుగా గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించి, ఆ సంఘం నుంచి ప్రతినిధులను విలీన కమిటీలో చేర్చే పక్రియను ప్రభుత్వం అనుసరిస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్ మాదిరి విలీనం తర్వాత ఇబ్బందులు కలగవద్దని గుర్తింపు కార్మిక సంఘాల నేతలను కమిటీ లో చేర్చి విధివిధానాలు రూపొందించేలా నిర్ణయం తీసుకున్నామ న్నారు. ఈ పరిస్థితుల్లో కొంతమంది కార్మిక సంఘాల నాయకులు గుర్తింపు సంఘాల ఎన్నికలు జరగకుండా, విలీన పక్రియను కూడా వివాదాస్పదం చేసేలా వ్యవహరించడం సరికాదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తోందని, కార్మికులు వాస్తవాలను గుర్తించి అసత్య ప్రచారాలను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. మాట మీద నిలబడే కాంగ్రెస్ ప్రభుత్వం విలీన పక్రియ గురించి భవిష్యత్ లో ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలని గుర్తింపు సంఘం కార్మిక నేతలను కమిటీ లో చేర్చి విలీన విధివిధానాలు రూపొందించాలని భావిస్తుంది దీనిని సమస్త కార్మిక లోకం గమనించగలరని అన్నారు.

## పౌరసత్వానికి, పాస్‌పోర్టుకు తేడా తెలియదా?

(మొదటిపేజీ తరువాయి)

బద్ధమైన పదవుల్లో ఉన్నవారు బాధ్యతాయుతంగా మాట్లాడాల ని పేర్కొన్న కిషన్ రెడ్డి.. ప్రజలను తప్పుదారి పట్టించే ముందు అసదుద్దీన్ ఒవైసీ పౌరసత్వ చట్టం1955, పాస్‌పోర్ట్ చట్టం1967లను మరోసారి క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని సూచించారు. అసదుద్దీన్ వ్యాఖ్యలు చట్టంపై ఆయనకున్న అవగాహన లోపాన్ని, రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల్లో అయోమయం సృష్టించే ప్రయత్నాన్ని సూచిస్తున్నాయని మండిపడ్డారు. విదేశాంగ మంత్రిత్వ శాఖ ఇచ్చిన వివరణను కొందరు తప్పుగా చిత్రీకరిస్తున్నారని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. విదేశాంగ శాఖ వివరణ ప్రకారం భారత పాస్‌పోర్టు విలువలేనిదని అర్థం కాదని, పాస్‌పోర్టు ఒక్కటే భారత పౌరసత్వానికి తుది, ఖచ్చితమైన ఆధారం కాదని మాత్రమే ప్రభుత్వం పేర్కొందని ఆయన వివరించారు. భారత పౌరసత్వం అనేది ఎల్లప్పుడూ భారత రాజ్యాంగం , పౌరసత్వ చట్టం1955 ప్రకారమే నిర్ణయించబడుతుందని స్పష్టం చేశారు. పాస్‌పోర్ట్ చట్టం1967 ప్రకారం పాస్‌పోర్టు అనేది ప్రధానంగా విదేశీ ప్రయాణాల కోసం ఉపయోగించే ఒక పత్రం (÷సజీలు ఆనీఇ-బీపuనిబి) మాత్రమేనని కేంద్ర మంత్రి తెలిపారు. ఆ చట్టంలోని సెక్షన్ 20 ప్రకారం.. ప్రజాహితం దృష్ట్యా భారత పౌరుడు కాని వ్యక్తికి కూడా కేంద్ర ప్రభుత్వం పాస్‌పోర్టు లేదా ట్రావెల్ డాక్యుమెంట్‌ను జారీ చేసే ప్రత్యేక అధికారాన్ని కలిగి ఉంటుందని గుర్తుచేశారు. గతంలో కూడా ఇటువంటి ప్రత్యేక సందర్భాలు ఉన్నాయని, అందువల్ల పాస్-పోర్టును మాత్రమే పౌరసత్వానికి తుది ప్రాతిపదికగా పరిగణించలేమని చెప్పారు. ఇది ఇప్పటికప్పుడు తెచ్చిన కొత్త నిబంధన కాదని, 1967లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఈ చట్టం అమల్లోకి వచ్చిందని తెలిపారు. దాదాపు 60 ఏళు



ౢగా అమల్లో ఉన్న చట్టపరమైన అంశాన్ని ఇప్పుడు మోదీ ప్రభుత్వంపై నెట్టడం అవగాహన లోపమో, లేదా వాస్తవాలను దాచిపెట్టే కుట్రో అవుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పౌరసత్వ చట్టం1955 ప్రకారం ఒక వ్యక్తికి భారత పౌరసత్వం అనేది జననం, వంశపారంపర్యం, నమోదు లేదా నేచురలైజేషన్ పక్రియల ద్వారా మాత్రమే లభిస్తుందని కిషన్ రెడ్డి వివరించారు. గతంలో 2013లో బొంబాయి హైకోర్టు ఇచ్చిన తీర్పును ప్రస్తావిస్తూ.. పాస్‌పోర్టు, జనన ధృవీకరణ పత్రం వంటి పత్రాలు మాత్రమే పౌరసత్వాన్ని నిరూపించ డానికి పూర్తిగా సరిపోవని న్యాయస్థానం స్పష్టం చేసిందని, దేశంలోని ఇతర హైకోర్టులు కూడా ఇదే సూత్రాన్ని అనుసరిం చాయని గుర్తుచేశారు. విదేశాంగ మంత్రిత్వ శాఖ ఎలాంటి కొత్త విధానాన్ని లేదా నిబంధనను ప్రకటించలేదని, దేశ చట్టాలు, న్యాయస్థానాలు ఇప్పటికే స్పష్టం చేసిన పాత అంశా న్నే మరోసారి పునరుద్ఘాటించిందని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

## ముగ్గురు సిఎంలు ఏం మాట్లాడుకున్నారు?

- ఆ చీకటి ఒప్పందం ఏమిటో ప్రజలకు చెప్పండి
- తెలంగాణ హక్కులుకు భంగం వాటిల్లేలా రేవంత్ నిర్ణయాలు
- మరోమారు విమర్శలు గుప్పించిన హరీష్ రావు

**హైదరాబాద్,జూన్ 27 :** ఇటీవల కర్ణాటకలో మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య జరిగిన చీకటి ఒప్పందాలు ఏంటని మాజీ మంత్రి, బీఆర్ఎస్ కీలక నేత హరీష్ రావు ప్రశ్నిం చారు. కర్ణాటకలో మూడు రాష్ట్రాల సీఎంలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను కూడా లోపలికి రానీయకుండా నలుగురే కూర్చుని ఏం ఒప్పందాలు చేసుకున్నారో సమాధానం చెప్పాలన్నారు. తెలంగాణకు తీవ్ర నష్టం కలిగించేలా కర్ణాటకలో నవేలి, ఏపీలో గుండ్రేవుల ప్రాజెక్టులు కడతామంటుంటే మన ముఖ్యమంత్రి చారిత్రక ఒప్పందం అంటూ సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. గతంలో గుండ్రేవులకు నీళ్లు ఇవ్వబోమని ట్రిబ్యునల్ చెప్తే, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దాన్ని రానీయకుండా అడ్డుకున్నామని, కానీ ఇప్పుడు ఏపీ ముఖ్యమంత్రి తన శిష్యుడైన తెలంగాణలో సీఎం అయ్యాడనే ధీమాతో మళ్లీ ఆ ప్రాజెక్టును ముందుకు తెచ్చారని ఆరోపిం చారు. ఆర్‌డీఎస్ కు పక్కా నీటి కేటాయింపులపై ఏమైనా స్పష్టమైన హామీ వచ్చిందా అని ప్రశ్నిస్తూ, రేవంత్ రెడ్డికి నీటి వాటాలపై కనీస అవగాహన లేదని హరీష్ రావు ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి కాంప్రమైజ్ అయినా బీఆర్ఎస్ అస్స లు ఒప్పుకోదని స్పష్టం చేశారు. గత అరవై ఏళ్లలో కాంగ్రెస్ ఏడాదికి సగటున 4 టీఎంసీల చొప్పున అనుమతులు తెస్తే, బీఆర్ఎస్ హయాంలో ప్రతి ఏడాది 44 టీఎంసీల చొప్పున పర్మిషన్లు తెచ్చామని గుర్తుచేశారు. మనకు రావాల్సిన 968 టీఎంసీలలో 830 టీఎంసీలకు అనుమతులు తెచ్చుకున్నామ ని, ఇంకా 138 టీఎంసీల అనుమతులు రావాల్సి ఉందని వివరించారు. ఏపీ ప్రభుత్వం అక్రమంగా 'బనకచర్ల' ప్రాజెక్ట్ నిర్మిస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్ర పోయిందని, ఆ నిద్రను తట్టిలేపింది బీఆర్ఎస్సేనని చెప్పారు. పాలమూరు పేరిట సమ్మక్క సారక్క ప్రాజెక్టును రేవంత్ రెడ్డి ఎండబెడుతు న్నారని, తాగేందుకు మంచి నీళ్లు లేక పాలమూరు తీవ్రంగా నష్టపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మన రాష్ట్రంలోని మేడిగడ్డ గేట్లను రిపేర్ చెయ్యడం చేతకాదు గానీ, తుంగభద్ర గేట్ల రిపేర్ కోసం రేవంత్ రెడ్డి వెళ్తున్నారని విమర్శించారు. హైడ్రా విషయంలో రేవంత్ రెడ్డికి హిట్లర్ స్ఫూర్తి అయితే, నీళ్ల విషయంలో రోమ్ తగలబడుతుంటే ఫిడేల్ వాయించిన నీరో చక్రవర్తి స్ఫూర్తి అనిపిస్తోందని ఎద్దేవా చేశారు. గుంపు మేస్త్రి అయిన రేవంత్ రెడ్డి, తెలంగాణను ముంచే ముంపు మేస్త్రి కావొద్దని హరీష్ రావు హితవు పలికారు. కాంగ్రెస్ వైఖరి వల్ల ఆంధ్రప్రదేశ్ సుజలం, కర్ణాటక సుఫలం, తెలంగాణ నిష్ఫలంగా మారుతోందని, కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు ఒక్క చుక్క నీటి విషయంలో అన్యాయం జరిగినా కేసీఆర్, బీఆర్ఎస్ ఊరుకునే ప్రసక్తే లేదని తస్మాత్ జాగ్రత్త అంటూ హెచ్చరించారు.

## పుంజుకుంటున్న నైరుతి రుతుపవనాలు

### చురకుగా కదులుతున్నాయన్న వాతావరణ శాఖ

**హైదరాబాద్, జూన్ 27 :** నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించి రోజులు గడుస్తున్నా వర్షాలు లేక తీవ్రమైన ఎండ, ఉక్కపోతతో అల్లాడుతున్న తెలంగాణ ప్రజలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం చల్లని కబురు అందించింది. రుతుపవనా లు ఆలస్యంగా పుంజుకోవడంతో రాష్ట్రంలో వర్షపాతం కొరత ఏర్పడింది. అయితే తాజాగా రుతుపవనాలు చురుగ్గా కదులు తున్నాయని, దీని ప్రభావంతో తెలంగాణవ్యాప్తంగా రానున్న ఏడు రోజులపాటు విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావ రణ కేంద్రం ప్రకటించింది. ముఖ్యంగా ఉత్తర, తూర్పు తెలం గాణ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని స్పష్టంచేసింది. వాతావరణ కేంద్రం తాజా అంచనాల ప్రకారం.. ఇవాళ ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఈ రెండు జిల్లాలకు 'ఎల్లో అలర్ట్' జారీచేశారు. వీటితోపాటు హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ, కుమురం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి, యాదాద్రి భువనగిరి తదితర జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు జల్లులు పడతాయని తెలిపింది.

## జులై 15న ఉద్యోగుల కొత్త ఆరోగ్య పథకం

(మొదటిపేజీ తరువాయి)

ట్రస్టు సభ్యుల సమావేశం నిర్వహించనున్నారు. ఈమేరకు సంబంధిత అధికారులు చర్య లు తీసుకోవాలని సీఎస్ ఆదేశించారు. పథకం అమలుకు సంబంధించిన పలు అంశాలను కూడా సమావేశంలో ప్రస్తావించారు. తదుపరి సమావేశంలో ప్యాకేజీ రేట్లు, ఆస్పత్రుల జాబితాలను ఖరారు చేయనున్నారు. ఈ సమావేశంలో ట్రస్టు సభ్యులు మారం జగదీశ్వర్, ఏలూరి శ్రీనివాసరావు, వి.లచ్చిరెడ్డి, సైదులు, చావ రవి, జి.సదానందం పాల్గొన్నారు.

## నేడు పల్స్ పోలియో

(మొదటిపేజీ తరువాయి)

జూలై 1న కూడా కార్యక్రమం కొనసాగుతుంది. ఇందుకోసం రాష్ట్రంలో 22,979 పోలియో బూత్‌లు, 903 మొబైల్ బృందాలు, 104 ట్రాన్సిట్ పాయింట్లను ఏర్పా-టుచేశారు. తెలంగాణ 2007 నుంచి పోలియో రహిత రాష్ట్రంగా కొనసాగుతోంది. చివరి పోలియో కేసు సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో నమోదైంది. వలస కార్మికులు, ఇటుక బట్టీలు, గిరిజన ప్రాంతాలు, పట్టణ మురికివాడల్లోని చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు ఆరోగ్యశాఖ తెలిపింది. ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేసింది.

## మరో పేపర్ లీక్ బట్టబయలు

### మహారాష్ట్రలో 24 గంటలముందే టెట్ పేపర్ లీక్ నేటి టెట్ పరీక్షను రద్దు చేసిన అధికారులు

**ముంబై, జూన్ 27 :** దేశంలో పరీక్ష పేపర్ల లీకేజీల పర్వం కొనసాగుతూనే ఉంది. తాజాగా మహారాష్ట్రలో 'ఉపాధ్యాయ అర్హత పరీక్ష' టెట్ పేపర్.. పరీక్షకు 24 గంటల ముందే లీక్ కావడం కలకలం రేపింది. ఆదివారం జరగాల్సిన ఈ పరీక్షను పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు మహారాష్ట్ర పరీక్షల మండలి ఒక అధికారిక ప్రకటనలో తెలిపింది. పరీక్షల పక్రియలో పారదర్శకత, నమ్మకత్వాన్ని కాపాడేందుకే ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు మండలి స్పష్టం చేసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. థానే రీజియన్ పరిధిలో టెట్ క్వశ్చన్ పేపర్ లీక్ అయినట్లు శనివారం తెల్లవారుజామున పోలీసులకు ముందస్తు సమాచారం అందింది. దీనిపై వెంటనే స్పందించిన భివండీ పోలీసులు ఒక రహస్య స్థావరంపై దాడి చేశారు. అక్కడ కొందరు వ్యక్తులు సీల్డ్ టెట్ క్వశ్చన్ పేపర్ ప్యాకెట్‌కు సంబంధించిన పేజీలను కలిగి ఉండడాన్ని గుర్తించారు. వెంటనే పరీక్షల మండలి అధికారులను పిలిపించి ఆ పేజీలను అసలు ప్రశ్నపత్రంతో సరిపోల్చి చూశారు. అవి లీక్ అయిన ఒరిజినల్ పేపరేనని తేలడంతో భివండీ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారంలో పోలీసులు పలువురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,028 కేంద్రాలలో రేపు (ఆదివారం) జరగాల్సిన ఈ పరీక్ష కోసం సుమారు 4.28 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. పరీక్ష కోసం అన్ని ఏర్పాట్లు చేసుకుని, కేంద్రాలకు బయలుదేరే సమయానికి పేపర్ లీక్ కారణంగా పరీక్ష వాయిదా పడడంతో లక్షలాది మంది అభ్యర్థులు తీవ్ర నిరాశకు, ఆందోళనకు గురవుతున్నారు.



## 14 నైబర్‌హుడ్ సెంటర్లకు ఉచిత రవాణా

### ఈ- ఆటోలను ప్రారంభించిన మంత్రి సీతక్క

**హైదరాబాద్, జూన్ 27 :** దివ్యాంగుల కోసం రాష్ట్రంలోని 14 నైబర్‌హుడ్ సెంటర్లకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించే లక్ష్యంతో ఈ-ఆటోల పంపిణీని తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క పాల్గొన్నారు. హెలెన్ కెల్లర్ జయంతి సందర్భంగా దివ్యాంగుల రవాణా సదుపాయాలను మెరుగుపరిచే లక్ష్యంతో ఈ-ఆటోలను పంపిణీ చేయడం శుభపరిణామమని మంత్రి సీతక్క అన్నారు. దివ్యాంగులు జీవితాన్ని సవాల్‌గా స్వీకరిస్తే అసాధారణ విజయాలను సాధించగలరని ఆమె పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి, వారి అభివృద్ధికి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. 'వైకల్యం అనేది కేవలం శారీరక లోపమే. మానవత్వంలేని వారే అసలైన దివ్యాంగులు. ఇతరులను అవమానించే అహంకారం కూడా ఒక రకమైన వైకల్యమే. పుట్టుకతో వచ్చిన లోపాలను తల్లిదండ్రుల ప్రోత్సాహం, సరైన శిక్షణ, సమాజం సహకారంతో అధిగమించవచ్చు. చూపు, వినికిడి లేకపోయినా హెలెన్ కెల్లర్ ప్రపంచానికి స్ఫూర్తిగా నిలిచారు' అని అన్నారు. 'దివ్యాంగులను చీదరించకుండా వారికి అవకాశాలు కల్పిస్తే అన్ని రంగాల్లో అద్భుతంగా రాణిస్తారు. బ్రెయిలీ వంటి సాంకేతిక పరిజ్ఞానం ద్వారా అనేక మంది దివ్యాంగులు తమ లక్ష్యాలను చేరుకుంటున్నారు. తల్లిదండ్రులపై ఉన్న ఆర్థిక, రవాణా భారాన్ని తగ్గించడానికే ఈ-ఆటోల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాం' అని సీతక్క చెప్పారు. ఈ సందర్భంగా ఐఓసీఎల్‌కు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# రాష్ట్ర రోడ్లకు ఇక మహర్దశ

## హ్యామ్ రోడ్లకు నేడు సిఎం శంకుస్థాపన

### నల్లగొండ జిల్లా కనగల్‌లో నేడు శ్రీకారం



**నల్లగొండ, జూన్ 27 :** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా రహదారుల రూపురేఖలను మార్చేలా ప్రభుత్వం భారీ ప్రాజెక్టుకు శ్రీకారం చుడుతోంది. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్) పద్ధతిలో చేపట్టనున్న ఈ ప్రతిష్టాత్మక రోడ్ల పనులకు 28న నల్గొండ జిల్లా కనగల్ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. రాష్ట్ర చరిత్రలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఈ మెగా రోడ్డు ప్రాజెక్టు కోసం ప్రభుత్వం సుమారు రూ. 13,006 కోట్ల భారీ బడ్జెట్‌ను కేటాయించింది. దీని ద్వారా రాష్ట్రంలోని అన్ని ప్రధాన ప్రాంతాలను అనుసంధానిస్తూ వేగవంతమైన, సురక్షితమైన , అత్యాధునిక రవాణా సౌకర్యాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మెగా ప్రాజెక్టులో భాగంగా మొదటి విడత కింద రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 6,092 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న 441 రోడ్లను అభివృద్ధి చేయనున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య రవాణా వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు, వాణిజ్య పరంగా కీలకమైన మార్గాలను బలోపేతం చేసేందుకు ఈ నిధులను ఖర్చు చేయనున్నారు. హ్యామ్ విధానం లో చేపట్టడం వల్ల పనులు అత్యంత నాణ్యతతో, నిర్ణీత గడువులోగా పూర్తవుతాయని అధికారులు భావిస్తున్నారు. ప్రయాణ సమయాన్ని తగ్గించడంతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ ఈ రహదారుల రూపకల్పన జరిగింది. కనగల్‌లో జరిగే ఈ శంకుస్థాపన కార్యక్రమానికి మంత్రులు, ఉన్నతాధికారులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరు కానున్నారు. ఈ పనులు పూర్తయితే తెలంగాణలో మౌలిక వసతుల రంగం సరికొత్త మైలురాయిని అధిగమిస్తుందని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ప్రభుత్వం ధీమా వ్యక్తం చేస్తోంది.



## అభివృద్ధి పనులు వేగంగా చేపట్టాలి

### అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశం

**ఖమ్మం, జూన్ 27 :** పాలేరు నియోజకవర్గ పరిధిలోని కూసుమంచి మండలంలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విస్తృతంగా పర్యటించారు. మండలంలోని దుబ్బతండా, లాల్ సింగ్ తండా, జీళ్లచెరువు గ్రామాల్లోని పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈ గ్రామాల్లో రూ. 16.13 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్లు, వంతెనల నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ.. వర్షాకాలంలో తండా వాసులకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోకుండా ఉండేందుకే త్వరితగతిన పనులు పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. వానలు పడుతున్నా అభివృద్ధి పనులు కొనసాగుతాయని.. నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశిత గడువులోగా పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మంత్రి వెంట జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, తదితరులు ఉన్నారు.

## శంషాబాద్‌ల ప్రాంతంలో చిరుత సంచారం

### స్థానికుల సమాచారంతో అధికారుల వేట

**హైదరాబాద్, జూన్ 27 :** హైదరాబాద్‌లోని శంషాబాద్ ప్రాంతంలో చిరుత సంచరిస్తోందనే ప్రచారం స్థానికంగా కలకలం రేపుతోంది. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం పరిసరాల్లోని చిన్మయ స్కూల్ సమీపంలో చిరుత కనిపించిందంటూ స్థానికులు సమాచారం ఇచ్చారు. ఈ క్రమంలో అధికారులు అప్రమత్తమయ్యారు. సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. చిరుత ఆనవాళ్ళు, పాదముద్రలు లేదా ఇతర ఆధారాలు ఉన్నాయా అనే దానిపై అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. అవసరమైతే ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేసి పరిస్థితిని పర్యవేక్షిస్తామని అధికారులు తెలిపారు. చిరుత కనిపించిందనే వార్తతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా స్కూల్ పరిసర ప్రాంతాలు, నివాస కాలనీల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అయితే ఇప్పటివరకు చిరుత సంచారంపై అధికారికంగా ఎలాంటి నిర్ధారణ కాలేదు. అటవీశాఖ అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించి, చిరుత ఆనవాళ్లు లభించిన తర్వాతే స్పష్టమైన సమాచారం అందజేస్తామని తెలిపారు. ప్రజలు వదంతులను నమ్మకుండా, ఏదైనా అనుమానాస్పద జంతువు కనిపిస్తే వెంటనే అటవీశాఖ లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని అధికారులు సూచించారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

## తిరుమలలో కొనసాగుతున్న రద్దీ

### నేటి శ్రీవాణి కరెంట్ బుకింగ్ రద్దు

**తిరుమల,జూన్ 27 :** వరుస సెలవులతో తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. దీంతో దర్శనాలకు సమయం పెరుగుతోంది. ఈ క్రమంలో ఆదివారం నాటి శ్రీవాణి టిక్కెట్ల కౌంటర్‌ను రద్దు చేశారు. అధికార యంత్రాంగంతో కలిసి టిటిడే అదనపు ఈవో వెంకయ్య చౌదరి క్యూలైన్లను శనివారం పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జూన్ నెలలో పెద్ద సంఖ్యలో భక్తులు శ్రీవారిని దర్శించుకున్నట్లు చెప్పారు. రోజుకు 80 వేల మందికిపైగా దర్శనాలు చేయిస్తున్నాం. శనివారం లక్షన్నర మందికిపైగా దర్శనానికి వచ్చి వేచి ఉన్నారు. ఆదివారం కూడా రద్దీ కొనసాగే అవకాశం ఉంది. అందుకే నేటి శ్రీవాణి కరెంట్ బుకింగ్ టికెట్లు, వీఐపీ సిఫార్సు లేఖలపై ఇచ్చే దర్శనాలు రద్దు చేశాం. భక్తులకు సేవలందిస్తూ భద్రతను పర్యవేక్షిస్తున్నాం అని వెంకయ్య చౌదరి తెలిపారు. సామాన్యులకు త్వరగా దర్శనం కల్పించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

## హైదరాబాద్‌లో తిష్ట వేసిన రోహింగ్యాలు

### వీరిందరిని గుర్తించి పంపాల్సిందే: కిషన్ రెడ్డి

**హైదరాబాద్, జూన్ 27 :** హైదరాబాద్ నగరంలో ఎంతో మంది రోహింగ్యాలు అక్రమంగా నివాసం ఉన్నారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్ నుంచి వచ్చినవారికి ఇక్కడ ఓట్లు, రేషన్ కార్డులు, బ్యాంక్ ఖాతాలు ఉన్నాయని ఆక్షేపించారు. వీరందరనిని గుర్తించి వెనక్కి పంపాల్సి ఉందన్నారు. రామ్‌కోఠిలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీహాల్‌ను పరిశీలించిన కేంద్ర మంత్రి.. చిన్నారులకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. తర్వాత ఖైరతాబాద్ మున్సిపల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను కిషన్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం భాజపా కార్యాలయంలో మాట్లాడిన ఆయన.. పాతబస్తీలో బీఎల్‌వోలను మజ్లిస్ నేతలు బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. 'సర్'పై కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నేతలు ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. ఎవరెన్ని కుట్రలకు పాల్పడినా సమగ్ర ఓటరు జాబితా సవరణను అడ్డుకోలేరని కిషన్‌రెడ్డి తేల్చి చెప్పారు.

## గంజాయి స్మగ్లింగ్ ముఠా పట్టివేత

- శంషాబాద్‌లో భారీ ఆపరేషన్
- ఎస్కార్ట్ వాహనంతో పాటు మరి కొన్ని వాహనాలతో కాన్వాయ్
- 110 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్న పోలీసులు



**హైదరాబాద్,జూన్ 27 :** హైదరాబాద్ నగర శివార్లలో అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న ఒక ముఠాను పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. శంషాబాద్ డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ , ఆదిబట్ల పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఈ భారీ ఆపరేషన్‌లో సుమారు 110 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు శంషాబాద్ డీసీపీ రాజేష్ మీడియాకు వెల్లడించారు. సీజ్ చేసిన గంజాయి విలువ మార్కెట్లో రూ. 56 లక్షలు ఉంటుందని ఆయన తెలిపారు. ఈ స్మగ్లింగ్ రాకెట్‌కు సంబంధించి నలుగురు అంతర్రాష్ట్ర గంజాయి పెడ్లర్లను అరెస్ట్ చేయడంతో పాటు, రవాణాకు ఉపయోగించిన 2 కార్లు , 4 సెల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ ముఠా ఒడిశా రాష్ట్రం నుండి మహారాష్ట్రకు హైదరాబాద్ మీదుగా గంజాయిని అక్రమంగా తరలిస్తోంది. ఇందుకోసం టాటా హారియర్, మారుతి ఎర్టిగా వంటి లగ్జరీ వాహనాలను వినియోగించారు. పోలీసులకు దొరకకుండా ఉండేందుకు వీరు ఎంతో పకడ్బందీగా ప్లాన్ చేశారు. ఇందులో ఒక వాహనాన్ని 'పైలట్' వాహనంగా ముందు పంపిస్తూ.. మార్గమధ్యంలో ఎక్కడైనా పోలీస్ చెక్‌పోస్టులు, తనిఖీలు ఉన్నాయా అనే సమాచారాన్ని వెనుక గంజాయితో వస్తున్న వాహనానికి అందిస్తూ ఎస్కార్ట్‌గా వ్యవహరించేవారు. టోల్ గేట్లలో పోలీసుల నిఘాకు చిక్కకుండా ఉండేందుకు స్మగ్లర్లు చాకచక్యంగా వాహనాలకు నకిలీ మహారాష్ట్ర నెంబర్ ప్లేట్లను ఉపయోగించారు. అంతేకాకుండా, సాధారణ ఫోన్ కాల్స్ చేస్తే పోలీసులు ట్యాప్ చేస్తారనే భయంతో, ఒకరికొకరు సమాచారం ఇచ్చుకోవడానికి కేవలం ఇంటర్నెట్ కాలింగ్ (యాప్స్) మాత్రమే వాడుతూ నిఘా తప్పించుకునే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ, పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన టాస్క్ ఫోర్స్ పోలీసులు బొంగులూరు ఔటర్ రింగ్ రోడ్ గేట్ సమీపంలో ఈ రెండు వాహనాలను అడ్డుకుని గంజాయిని పట్టుకున్నారు. స్మగ్లర్లు ఒడిశాలోని బెర్హంపూర్‌కు చెందిన సరఫరాదారు ప్రభిత్ర ప్రధాన్ నుండి కేవలం రూ. 4 వేలకే కిలో గంజాయిని కొనుగోలు చేస్తున్నట్లు విచారణలో తేలింది. ఆ గంజాయిని మహారాష్ట్రకు తరలించి అక్కడ వినియోగదారులకు కిలో రూ. 20 వేల నుండి రూ. 30 వేల వరకు విక్రయిస్తూ భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. కాగా, ఈ ముఠాలో కీలకమైన ప్రధాన సూత్రధారి ప్రణవ్ సింగ్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడని, అతని కోసం గాలింపు చర్యలు చేపట్టామని డీసీపీ తెలిపారు. ఈ వ్యవహారంపై ఆదిబట్ల పోలీసులు కేసు నమోదు చేసి, దీని వెనుక ఇంకా ఎవరెవరు ఉన్నారనే కోణంలో ముమ్మర దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



## వీబీజీ రామ్‌జీ చట్టాన్ని అంగీకరించేది లేదు

### మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడి

**హైదరాబాద్, జూన్ 27 :** వీబీజీ రామ్‌జీ చట్టాన్ని అంగీకరించేది లేదని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ చట్టం రైతులు, గ్రామీణ పేదల ఉపాధిని దెబ్బతీసేలా ఉందని అన్నారు. వీబీజీ రామ్‌జీ పథకంపై తెలంగాణ క్యాబినెట్ సబ్ కమిటీ శనివారం సమావేశమైంది. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ హాజరయ్యారు. వీబీజీ రామ్‌జీ పథకం అమలుపై చర్చించారు. పేదల భవిష్యత్‌ను తాకట్టు పెట్టే చట్టాన్ని అంగీకరించం. వీబీజీ రామ్‌జీ చట్టంపై సుప్రీం కోర్టును ఆశ్రయించాలన్న యోచనలో ఉన్నాం. కేరళ, కర్ణాటకలతో కలిసి ఉమ్మడి కార్యాచరణ రూపొందిస్తాం' అని ఉత్తమ్ వెల్లడించారు.

## భద్రతపై ఆర్‌ఎస్‌కు ఆందోళన అవసరం లేదు

### సిఎం స్వయంగా తన కాన్వాయ్‌లో భద్రతను కుదించారు

### ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ వెల్లడి

**హైదరాబాద్,జూన్ 27 :** ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్‌కు భద్రతపై అనుమానాలు అవసరం లేదని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ అన్నారు. ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ తన వ్యక్తిగత భద్రత విషయంలో అనవసర అనుమానాలు వ్యక్తం చేయాల్సిన అవసరం లేదన్నారు. ఆయన భద్రతకు సంబంధించి అవసరమైన నిర్ణయాలు పోలీసు శాఖ తీసుకుంటుందని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా తన భద్రతను తగ్గించుకున్నారని దయాకర్ తెలిపారు. సీఎం కాన్వాయ్‌లో గతంలో ఉండే జామర్, అంబులెన్స్ వంటి వాహనాలు ప్రస్తుతం లేవని, మొత్తం మూడు వాహనాలతోనే ముఖ్యమంత్రి ప్రయాణిస్తున్నారని చెప్పారు. అంతేకాకుండా, సీఎం ప్రయాణాలకు ప్రత్యేక ట్రాఫిక్ క్లియరెన్స్ కూడా ఇవ్వడం లేదని పేర్కొన్నారు. దేశంలో ప్రస్తుతం నక్సల్స్ ముప్పు లేదని కేంద్ర ప్రభుత్వమే ప్రకటిస్తోందని దయాకర్ గుర్తు చేశారు. అలాంటి పరిస్థితుల్లో ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ రాజకీయ ప్రయోజనాల కోసం వ్యక్తిగత భద్రత అంశాన్ని ప్రస్తావిస్తున్నారని విమర్శించారు. ఒకవేళ తనకు అదనపు భద్రత అవసరమని ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ భావిస్తే, సంబంధిత పోలీసు శాఖకు అధికారికంగా విజ్ఞప్తి చేసుకోవచ్చని దయాకర్ సూచించారు. భద్రత కల్పించాల్సిన అవసరం ఉందా లేదా అనే అంశాన్ని పూర్తిగా భద్రతా సంస్థలే అంచనా వేసి నిర్ణయం తీసుకుంటాయని ఆయన స్పష్టం చేశారు.

## తక్కువ ధరకు బంగారం అంటూ బురిడీ

### పారిపోతుండగా సూర్యాభాయ్ అరెస్ట్

**హైదరాబాద్, జూన్ 27 :** గోల్డ్ మ్యాన్ సూర్యభాయ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. హైదరాబాద్ నుంచి షాద్‌నగర్ పారిపోతుండగా పోలీసులు పట్టుకున్నారు. తక్కువ ధరకే బంగారం ఇప్పిస్తానంటూ అమాయకులను సూర్య భాయ్ బురిడీ కొట్టించాడు. తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని అడిగితే.. ఏకంగా బాధితులపై కేసు పెట్టాడు. చివరకు అసలు రంగు బయటపడటంతో పారిపోయేందుకు ప్రయత్నిస్తుండగా గోల్డ్ మ్యాన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. తక్కువ ధరకే విదేశీ బంగారం ఇస్తానంటూ అమాయకుల నుంచి సూర్య భాయ్ లక్షలాది రూపాయలను వసూలు చేసి భారీ మోసానికి తెరతీశాడు. గోల్డ్ మ్యాన్ మాటలు నమ్మి హిమాయత్‌నగర్, నీలోఫర్‌కు చెందిన బాధితులు దాదాపు రూ.30 లక్షలు ఇచ్చారు. అయితే బంగారం ఇవ్వకపోవడంతో సూర్య ఇంటికి వెళ్లిన బాధితులు.. తమ డబ్బులు తమకు తిరిగి ఇచ్చేయాలని కోరారు. దీంతో తన వద్ద ఉన్న మూడు ఐఫోన్లను ఇచ్చి వాటి విలువ రూ.10 లక్షలు అని, అలాగే రూ.20 లక్షల చెక్ ఇచ్చి బాధితులను పంపించేశాడు. అనంతరం బాధతులపైనే సూర్య భాయ్ తిరిగి పోలీసులకు ఫిర్యాదు చేశాను. తనను బెదిరించి ఫోన్ లాక్కెల్లారంటూ సూర్య భాయ్ పోలీసులను తెలిపారు. ఈ విషయంలో లోతుగా దర్యాప్తు చేసిన పోలీసులు అసలు నిజాన్ని బయటపెట్టారు. తక్కువ ధరకే బంగారం పేరుతో సూర్య భాయ్ మోసం చేశారంటూ అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం ఈ కేసును నారాయణగూడకు బదిలీ చేశారు. అయితే అరెస్ట్ భయంతో సూర్య భాయ్ హైదరాబాద్ నుంచి పారిపోయేందుకు ప్రయత్నించగా షాద్‌నగర్‌లో పోలీసులు పట్టుకున్నారు.

## నగరంలో వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి




**హైదరాబాద్, జూన్ 27 :** హైదరాబాద్ నగరంలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందగా.. మరో ముగ్గురికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. శనివారం ఉదయం రాయదుర్గం బయోడైవర్సిటీ పార్కు చౌరస్తా సమీపంలో బైక్‌ను కారు ఢీకొంది. ఈ ఘటనలో బోరబండకు చెందిన ద్విచక్ర వాహనదారుడు నరేశ్(33) మృతి చెందగా.. మరో యువతికి గాయాలయ్యాయి. మరోవైపు ఖాజాగూడ చెరువు రోడ్డులోని ఓ ఇంజినీరింగ్ కళాశాల వద్ద శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అభి ఆనంద్‌సింగ్(27) అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు గాయపడ్డారు.

## ఏసీబీకి చిక్కిన పంచాయతీ కార్యదర్శి

### లంచం తీసుకుంటుండగా పట్టివేత

**ఖమ్మం,జూన్ 27 :** ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం బాణాపురం పంచాయతీ కార్యదర్శి తమ్మిశెట్టి సురేశ్‌ను శనివారం ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ రమేష్ కథనం మేరకు.. ముదిగొండ మండలం బాణాపురానికి చెందిన ఓ రైతు తన తండ్రి ఇచ్చిన ఐదు గుంటల స్థలంలో రేకుల గది నిర్మాణానికి, ఇంటి నంబర్ కోసం గత నెల 19న దరఖాస్తు చేసుకున్నాడు. ఇంటి నిర్మాణం అనుమతి, ఇంటి నంబర్ కేటాయించటానికి పంచాయతీ కార్యదర్శి సురేష్.. బాధితుడ్ని రూ .40వేలు లంచం డిమాండ్ చేశారు. అంత నగదు ఇచ్చుకోలేనని రూ .25 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. అనంతరం ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. శనివారం ముదిగొండలోని రైతు వేదిక వద్ద బాధితుడి వద్ద నుంచి రూ.25 వేలు లంచం తీసుకుంటుండగా సురేశ్‌ను రెడ్ హ్యాండ్‌డెగా పట్టుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ రమేష్ తెలిపారు. అనంతరం బాణాపురం గ్రామ పంచాయతీ కార్యాలయానికి తీసుకొచ్చి విచారణ చేపట్టారు. అక్కడ ఉన్న పలు రికార్డులను తనిఖీ చేశామన్నారు.

## బస్వాపూర్ శివారులో చిరుత సంచారం

### మేకను ఎత్తుకెళ్లిందంటున్న గ్రామస్థులు

**నిజామాబాద్,జూన్ 27 :** జుక్కల్ మండల పరిధిలోని బస్వాపూర్ గ్రామ శివారులో చిరుత సంచారం కలకలం రేపింది. గ్రామ శివారులో మేత మేస్తున్న గొర్రెల గుంపులోకి వచ్చిన చిరుత.. ఓ మేకపిల్లను ఎత్తుకెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ ఘటనతో అప్రమత్తమైన స్థానికులు వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఫారెస్ట్ అధికారులు అక్కడ కనిపించిన అడుగుజాడలను పరిశీలించి అవి చిరుత పాదాలేనని నిర్ధారించారు. ఈ నేపథ్యంలో రైతులు, పశువుల కాపరులు, గ్రామ ప్రజలు ఒంటరిగా పొలాలు, అటవీ ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో అప్రమత్తంగా ఉండాలని, చిరుత కనిపించినా లేదా ఆనవాళ్లు గుర్తించినా వెంటనే అటవీ శాఖకు సమాచారం ఇవ్వాలని కోరారు. గ్రామ పరిసరాల్లో చిరుత సంచారం నేపథ్యంలో స్థానికుల్లో ఆందోళన నెలకొంది. అటవీ శాఖ అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అవసరమైతే చిరుతను బంధించేందుకు తగిన చర్యలు చేపడతామని తెలిపారు.

## అజిత్ రెడ్డికి మెట్రో అడిషన్ ఎండిగా అదనపు బాధ్యతలు

### ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం

**హైదరాబాద్, జూన్ 27 :** సీనియర్ ఐఏఎస్ అధికారి అజిత్ రెడ్డికి తెలంగాణ ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. ప్రస్తుతం ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓగా కొనసాగుతున్న ఆయనను హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ అదనపు మేనేజింగ్ డైరెక్టర్ గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తాజా ఉత్తర్వుల ప్రకారం.. ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓగా తన బాధ్యతలను కొనసాగిస్తూనే హైదరాబాద్ మెట్రో రైల్ అదనపు ఎండీగా కూడా అజిత్ రెడ్డి విధులు నిర్వర్తించనున్నారు. అజిత్ రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి బదిలీ చేసిన విషయం తెలిసిందే. బదిలీ అనంతరం తాజాగా ఆయనకు హైదరాబాద్ మెట్రో రైల్‌లో కీలక అదనపు బాధ్యతలు అప్పగించడం ప్రాధాన్యం సంతరించుకుంది. కాగా.. ప్రస్తుతం హెచ్ఎంఆర్ఎల్ మేనేజింగ్ డైరెక్టర్‌గా సర్ఫరాజ్ అహ్మద్ కొనసాతున్నారు. మెట్రో రైల్ ప్రాజెక్టుల నిర్వహణ, విస్తరణ పనులు వేగవంతం చేయడంతో పాటు పరిపాలనా వ్యవహారాల్లో సమన్వయాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఈ నియామకం దోహదపడుతోందని ప్రభుత్వం భావిస్తోంది.

## స్కూల్ బస్సు కింద పడి బాలుడు మృతి

**భువనగిరి,జూన్ 27 :** యాదాద్రి జిల్లా భువనగిరి మండలం వడపర్తిలో విషాదం చోటు చేసుకుంది. స్కూల్ బస్సు కింద పడి రెండున్నరేళ్ల బాలుడు మృతి చెందాడు. పెద్ద కుమారుడిని దింపేందుకు తల్లి స్కూల్ బస్సు దగ్గరికి వెళ్లింది. అన్న కోసం ఆమె వెనకే బాలుడు కూడా వెళ్లాడు. డ్రైవర్ గమనించకుండా బస్సును ముందుకు తీసేయడంతో టైరు కింద పడి బాలుడు మృతి చెందాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రజల్లో ప్రశ్నించే తత్వం చచ్చిపోయిందా?



దృశ్యం సినిమాలో హీరో ఓ వ్యక్తిని చంపి మాయం చేస్తాడు. పోలీస్ అధికారి కొడుకైన అతడి ఆచూకీ కోసం పోలీసులు ఎంతగా ప్రయత్నించినా పట్టుకోలేక పోతారు. శవాన్నా మాయం చేసినా గుర్తించలేక పోతారు. ఆధారాలు లేకుండా చంపేసి, పోలీస్ స్టేషన్‌లోనే పాతిపెట్టినా కనిపెట్టలేక పోతారు. ఇప్పుడు అచ్చంగా ఇలాంటి కథే ఒకటి విజయవాడలో చోటుచేసుకుంది. సాయికృష్ణ కస్టోడియల్ డెత్ జరిగి దాదాపు నెలదాటినా ఆచూకీ కనిపెట్టడం లేదు. ఎందుకంటే మాయమైన వ్యక్తిపై రౌడీషీట్ ఉంది. అందులోనూ ఓ సామాన్యుడు. ఘనత వహించిన చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం సాధించిన విజయమిది. జగన్ హయాంలోనూ ఓ డాక్టర్‌ను పిచ్చోడిని చేసి చంపారు. పిల్లలు మాయం అయ్యారు. పట్టించుకోలేదు. ఇకపోతే సాయికృష్ణ ఏమయ్యాడో అన్న సందర్భంలోనే తునిలో జ్ఞానేశ్వరి అనే ఓ చిన్నారి కూడా మాయం అయ్యింది. ఇప్పటికీ ఆమె ఆచూకీ కనుక్కోలేక పోయారు. నిజంగా ఇలాంటి ఘటనలు జరుగుతున్నా ప్రజలు స్పందించడం లేదు.

మనుషులు చస్తున్నా, మాయం అవుతున్నా సమాజాం ఎందుకో నిస్తేజంగా మారిపోయింది. హక్కుల గురించి మాట్లాడే నేతల నోళ్లు మూతపడ్డాయి. ఆందోళన చేసేవారు కనిపించడం లేదు. ఎర్రజెండాల వాళ్లకు ఏమయ్యిందో కనిపించడం లేదు. పౌరహక్కల కోసం అంటూ మాట్లాడే వారు మాయం అయ్యారు. అన్యాయాలు జరుగుతున్నా ప్రజలు ప్రశ్నించే శక్తని కోల్పోయారు. ఈ మధ్యే పుట్టిన కాక్రోచ్ జనతా పార్టీ వారు కూడా ఎక్కడా కిమ్మనడం లేదు. కొందరు ఆ మధ్య హైదరాబాద్ లో తామంతా కాక్రోచ్ అంటూ బయలుదేరారు. విజయవాడలో కస్టోడియల్ డెత్‌కు గురయ్యాడంటూ సిట్ చెప్పినా సాయికృష్ణణ వ్యవహారం గురంచి ఒక్కరు కూడా మాట్లాడడం లేదు. రాజకీయ లబ్ధి కోసం వైకాపా నేతలు మాట్లాడినా అది ప ఎద్దగా ప్రభావం చూపడం లేదు. ఆంధ్రప్రదేశ్‌లో సాయకృష్ణ అనే వ్యక్తి ఇప్పటికీ కనిపించడం లేదు. పోలీసుల అదుపులో ఉన్న వ్యక్తిని కొట్టి చంపేశారు. చంపితే శవాన్ని ఇవ్వాలి. కానీ శవాన్ని ఇవ్వలేదు. మాయం చేశారు. కాల్చేశారా పాతరేశారా లేక కృష్ణానదిలో ఉన్న మొసళ్లకు ఆహారంగా వేశారా అన్ని తెలియదు. సిట్ మాత్రం కస్టోడియల్ డెత్ అంటూ కోర్టుకు నివేదించింది. అయితే మరి శవం ఏమయ్యిందనేదే ప్రశ్న.

విజయవాడలో తీవ్ర సంచలనం సృష్టిస్తున్న సాయికృష్ణ మిస్సింగ్ కేసులో, తన కుమారుడు సాయి కృష్ణ చనిపోయాడని ధృవీకరిస్తూ సిఐ నాగరాజుపై చర్యలు తీసుకోవాలని ఈ నెల 19న అతని తల్లి విజయలక్ష్మి సీపీ రాజశేఖర్ బాబుకు ఫిర్యాదు చేసింది. పోలీసులు పట్టుకెళ్లినట్లు గుర్తించిన ఆమె సాయి కృష్ణ ఎక్కడున్నాడనే ప్రశ్నలకు తెరదించుతూ అతను చనిపోయడని తల్లి విజయలక్ష్మి తన ఫిర్యాదులో ధృవీకరించినట్టు తెలస్తోంది. సిఐ నాగరాజు తన కుమారుడిని తన కళ్ళెదుటే కొట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మే నెల మొదటి వారంలో సాయికృష్ణను పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిలబుల్ వారంట్‌తో కృష్ణలంక, మాచవరం పోలీసు స్టేషన్లో తీసుకొని వచ్చారని.. కృష్ణలంక స్టేషన్‌కు తెచ్చాకా సిఐ నాగరాజు తన కోడుకుని చంపేస్తాం దండ రెడీ చేసుకో అన్నారని ఆమె చెప్పుకొచ్చింది. అయితే సిఐ నాగరాజు సాయికృష్ణను మార్కాపురం నుంచి తీసుకొచ్చి కోర్టులో హాజరు పరచలేదని.. సాయి కృష్ణను అక్రమంగా నిర్బంధించి చిత్ర హింసలకు గురిచేసి తీవ్రంగా కొట్టారని ఆమె ఆరోపించింది. సిఐ నాగరాజు కొట్టిన దెబ్బలకు సాయి కృష్ణ చనిపోయాడని.. లాకప్ లో సాయి కృష్ణను కొట్టినప్పుడు అరుపులు కేకలు తాను విన్నానని ఆమె చెప్పుకొచ్చింది. తన కొడుకుని తనతో పంపమని అడిగితే.. తనపై సీఐ నాగరాజు గట్టిగా అరిచాడని ఆమె ఆరోపించింది. దీంతో ఏం చేయాలో తోచక తన చెల్లెలు ద్వారా హై కోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ ఫైల్ చేశామని.. సాయి కృష్ణ చనిపోయాడనే విషయం ఇబ్బందవుతుందని తన కుమారుడు శవాన్ని నామరూపాలు లేకుండా తగలబెట్టారని కూడా విజయలక్ష్మి ఫిర్యాదులో పేర్కొంది.

సాయి కృష్ణను చంపి ఆధారాలు లేకుండా చేసిన సిఐ నాగరాజుపై చర్యలు తీసుకోవాలని విజయలక్ష్మి డిమాండ్ చేసింది. విజయలక్ష్మీ ఫిర్యాదు ఆధారంగా సిఐ నాగరాజుపై అక్రమంగా నిర్బంధించడం, ఆధారాలు ధ్వంసం చేయడం,హత్య చేసిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేసిన పోలీసులు సాయికృష్ణ కస్టోడియల్ డెత్ చెందాడంటూ కోర్టుకు నివేదించారు. ఈ కేసు ప్రత్యేక విచారణ బృందం అధికారులు, నిందితుడైన సీఐ నాగరాజు రిమాండ్ రిపోర్టును విజయవాడ రెండవ అదనపు జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టుకు సమర్పించారు. చట్టవిరుద్ధంగా నిర్బంధించడం, పోలీస్ స్టేషన్‌లోనే దారుణంగా థర్డ్ డిగ్రీ ప్రయోగించడం, ఆపై ఆధారాలు దొరకకుండా శవాన్ని తగలబెట్టి మాయం చేయడం వంటి విషయాలను సిట్ నిర్ధారించింది. పోలీసుల థర్డ్ డిగ్రీ వల్లే సాయికృష్ణ చనిపోయాడని, ఆ తరువాత మృతదేహాన్ని సీఐ నాగరాజు వేరే చోటుకు తరలించి దహనం చేశారని రిమాండ్ రిపోర్టులో తెలిపింది. డిజిటల్ సాక్ష్యాలను సైతం మాయం చేయడంతో పాటు విచారణలోనూ సహకరించలేదని సిట్ కోర్టుకు తెలిపింది. నిజంగా ఇంత జరిగినా సిఎం చంద్రాబు పెద్దగా స్పందించలేదు. సిట్ వేసి మిన్నకున్నారు. ఓ మహిళ హోంమంత్రిగా ఉన్నా ఓ తల్లికి న్యాయం జరగలేదు. సాయికృష్ణ రౌడీషీటర్ అయితే, కేసులు పెట్టి బొక్కలో తోయాలి. కానీ ఉగ్రవాదిని చంపినట్లు చంపేశారు. తగులబెట్టేశారు. ఆధారాలు మాయం చేశారు. ఇంత జరుగుతున్నా, పోరాటాల గడ్డ బెజవాడ కిమ్మనడం లేదు. ఎర్రజెండా పార్టీల నోళు మూతలు పడ్డాయి. దీనిని ఓ కేసుగా పెద్దగా ఎవ్వరూ పరిగణించడం లేదని తేలింది. దీంతో ఎలాంటి సందేశాన్ని ఇవ్వాలనుకుంటున్నరో కూటమి పెద్దలు చెప్పాలి. ఓ వ్యక్తి కస్టోడియల్ డెత్ ఇప్పుడు సామాన్య వార్తగా మారడం విషాదం.

# భారత పర్యటనకు ట్రంప్

- త్వరలో ఖరారు కానున్న ట్రేడ్ డీల్
- ధృవీకరించిన అమెరికా విదేశాంగ మంత్రి మార్కో
- భారత్ -యూఎస్ బంధం బలోపేతం అంటూ కితాబు



**వాషింగ్టన్, జూన్ 27 :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వచ్చే ఏడాది ఆరంభంలో భారత పర్యటనకు వచ్చే అవకాశం ఉందని అగ్రరాజ్య విదేశాంగ మంత్రి మార్కో రుబియో వెల్లడించారు. ట్రంప్ భారత్ పర్యటన కోసం ఇప్పటికే ఏర్పాట్లు ప్రారంభించామని, ఈ ఏడాది చివర్లో తాను భారత్‌కు వచ్చి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను సమీక్షిస్తానని తెలిపారు. భారత్‌-అమెరికా మధ్య సంబంధాలు అద్భుతమంటూ కొనియాడారు. అధ్యక్షుడి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు ఖరారు చేయడానికి ఈ ఏడాది ముగిసేలోపే తాను భారత్‌కు వెళ్తానని పేర్కొన్నారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ట్రంప్ మొదటి భారత పర్యటన ఇదే కానుంది. అమెరికాకు భారత్ అత్యంత సన్నిహిత భాగస్వామి అని.. ప్రధాని నరేంద్ర మోదీ- ట్రంప్ మధ్య మంచి అనుబంధం ఉందని మార్కో రుబియో తెలిపారు. దౌత్యపరంగా వారి బంధం చాలా ఉపయోగకరమన్నారు. ఇటీవల ఫ్రాన్స్‌లో జరిగిన జీ7 సదస్సులో వాణిజ్య ఒప్పందం గురించి మోదీ-ట్రంప్ చర్చించారని రూబియో వెల్లడించారు. ఇరుదేశాల మధ్య జరుగుతున్న వాణిజ్య చర్చలు త్వరలో పూర్తి కానున్నట్లు తెలిపారు. ఇంధన సరఫరాను పెంచడానికి భారత్‌-అమెరికా కలిసికట్టుగా పనిచేస్తున్నాయన్నారు. చమురు శుద్ధి చేయగల సామర్థ్యం ఉన్న కొన్ని దేశాలలో భారత్ కూడా ఒకటని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీపై రూబియో ప్రశంసలు కురిపించారు. తాను ఆయనకు అభిమానినని తెలిపారు. ప్రపంచ వేదికపై భారతదేశ స్థాయిని పెంచిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. మోదీ భారత్‌ను ఒక ప్రపంచ శక్తిగా మార్చారని కొనియాడారు. భారత్‌-అమెరికా బంధం ప్రస్తుతం ఎంతో బలంగా ఉందని మార్కో రుబియో పేర్కొన్నారు. వైట్ హౌస్‌లో ఐఏఎన్‌ఎస్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో రుబియో మాట్లాడారు. 'వచ్చే ఏడాది ప్రారంభంలో అధ్యక్షుడు ట్రంప్, భారత్ పర్యటనకు వచ్చేలా ప్రయత్నాలు చేస్తున్నాం. అదే మా లక్ష్యం' అని చెప్పారు. అలాగే, అమెరికాకు భారత్ అత్యంత సన్నిహిత భాగస్వామి అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, అధ్యక్షుడు ట్రంప్ మధ్య ఉన్న స్నేహం ద్వైపాక్షిక బంధాలను మరింత బలోపేతం చేస్తోందని వ్యాఖ్యానిం చారు. లాగే ఇరు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందంపై చర్చలు తుది దశకు చేరుకున్నాయని కూడా రుబియో తెలిపారు . ఈ ఒప్పందం త్వరలోనే ఖరారయ్యే అవకాశాలు ఉన్నాయని, దీనివల్ల భారత్‌-అమెరికా ఆర్థిక, వ్యూహాత్మక సంబంధాలు మరింత బలపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే క్వాడ్ దేశాల నేతల సమావేశం కూడా త్వరలో నిర్వహించాలని అమెరికా ఎదురుచూస్తోందని చెప్పారు.

## ఆదానీ లంచం కేసులో
# ఫెడరల్ కోర్టు కీలక నిర్ణయం

### కేసు ఉపసహంరణకు నివేదిక ఇవ్వాలని జడ్జి ఆదేశం

**న్యూయార్క్, జూన్ 27 :** బిలియనీర్ గౌతమ్ అదానీ పై నమోదైన హై-ప్రొఫైల్ లంచం కేసులో అమెరికా ఫెడరల్ కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. అదానీతోపాటు ఇతర నిందితులపై ఉన్న క్రిమినల్ ఆరోపణలను తక్షణమే కొట్టివేసేందుకు ఫెడరల్ జడ్జి నిరాకరించారు. ఈ కేసును ఎందుకు ఉపసంహరించుకోవాలని అనుకుంటున్నారో తెలుపుతూ మరింత స్పష్టమైన, వివరణాత్మకమైన నివేదికను సమర్పించాలని అమెరికా జస్టిస్ డిపార్ట్‌మెంట్‌ను కోర్టు ఆదేశించింది. బ్రూక్లిన్ లోని యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి నికోలస్ గరాఫిస్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. కేసును ఉపసంహరించుకోవాలంటూ మే 18న జస్టిస్ డిపార్ట్‌మెంట్ దాఖలు చేసిన పిటిషన్ చాలా క్లుప్తంగా, ఎలాంటి బలమైన కారణాలు లేకుండా ఉందంటూ ఆయన అసంతృప్తి వ్యక్తంచేశారు. కేసును ఎందుకు డ్రాప్ చేయాలనుకుంటున్నారో సరైన ఆధారాలు, కారణాలతో కూడిన నివేదికను జూలై 13 లోగా కోర్టుకు సమర్పించాలని ప్రాసిక్యూటర్లను ఆదేశించారు. భారత్‌లో సౌర విద్యుత్ ప్రాజెక్టుల ఆమోదం కోసం ప్రభుత్వ అధికారులకు వందల మిలియన్ డాలర్ల లంచాలు ఇవ్వడానికి ప్రయత్నించారని, అలాగే అమెరికా ఇన్వెస్టర్లను తప్పుదోవ పట్టించారని గౌతమ్ అదానీ, ఆయన మేనల్లుడు సాగర్ అదానీపై 2024లో అమెరికాలో కేసు నమోదైంది. అయితే ఈ ఆరోపణలను అదానీ గ్రూప్ మొదటి నుంచీ తీవ్రంగా ఖండిస్తూ వస్తోంది. మే నెలలో ట్రంప్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. ఈ కేసుపై మరింత సమయం, వనరులను కేటాయించలేమని పేర్కొంటూ కేసును పూర్తిగా ఉపసంహరించుకోవాలని జస్టిస్ డిపార్ట్‌మెంట్ భావించింది. జూన్ 24న అదానీ తరపు న్యాయవాదులు కూడా ఈ కేసు అమెరికా అధికార పరిధిలోకి రాదని, లంచం ఇచ్చినట్లు నిరూపించడానికి తగిన ఆధారాలు లేవని పేర్కొంటూ కేసును అధికారికంగా కొట్టివేయాలని కోర్టును కోరారు. అయితే దీనిపై తుది నిర్ణయం తీసుకునే ముందు ప్రభుత్వం నుంచి పూర్తి వివరణ కావాలని న్యాయమూర్తి స్పష్టంచేశారు. ఈ క్రిమినల్ కేసు ప్రక్రియ ఇలా ఉండగా.. దీనికి సమాంతరంగా నడుస్తున్న సివిల్ వివాదాల పరిష్కారానికి అదానీ గ్రూప్ అంగీకరించింది. ఇందులో భాగంగా గౌతమ్ అదానీ 6 మిలియన్ డాలర్లు, సాగర్ అదానీ 12 మిలియన్ డాలర్ల మేర సివిల్ సెటిల్‌మెంట్ కింద చెల్లించే ప్రతిపాదనలు కోర్టు అనుమతి కోసం వేచి ఉన్నాయి. ఇవి కాకుండా ఇరాన్ నుంచి ద్రవీకృత పెట్రోలియం గ్యాస్ దిగుమతులకు సంబంధించి అమెరికా ఆంక్షలను ఉల్లంఘించారనే ఆరోపణల పరిష్కారానికిగాను అదానీ ఎంటర్‌ప్రైజెస్ అమెరికా ట్రెజరీకి 275 మిలియన్ డాలర్లు చెల్లించడానికి ఒప్పుకుంది.



## వెనెజువెలాలో మళ్లీ భూకంపం

### జంట విపత్తుల్లో రూ.63వేల కోట్ల నష్టం

**కారకస్ :** జంట భూకంపాలతో వణికిన వెనెజువెలాలో మరోసారి భూమి కంపించింది. ఈ భూకంప తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 4.9గా నమోదైంది. ఆ దేశ కాలమానం ప్రకారం శుక్రవారం మధ్యాహ్నం ఈ ప్రకంపనలు వచ్చాయి. రాజధాని నగరం కారకస్, మరాకే సమీపంలో ఈ ప్రభావం కనిపించడంతో ప్రజలు వణికిపోయారు. మరోవైపు, ఇటీవల సంభవించిన భారీ భూకంపాల కారణంగా ఆ దేశానికి రూ.63వేల కోట్ల నష్టం వాటిల్లినట్లు అంచనా. బుధవారం సాయంత్రం 7.2, 7.5 తీవ్రతతో క్షణాల వ్యవధిలో రెండు భూకంపాలు రావడంతో వేలాదిమంది శిథిలాల కింద చిక్కుకుపోయారు. వందల భవనాలు కూలిపోవడంతో సహాయకచర్యలు క్లిష్టంగా మారాయి. రెస్క్యూ సిబ్బంది సంఖ్య పరిమితంగా ఉండటంతో.. ఆత్మీయులను కోల్పోయిన వారంతా చేతులతోనే శిథిలాలను తొలగిస్తున్నారు. ప్రాణాలతో రక్షించడానికి తొలి 48 నుంచి 72 గంటలు కీలకం కావడంతో ఎలాగైనా తమవారిని కాపాడుకోవాలని వారు చేస్తోన్న ప్రయత్నాలతో భూకంప ప్రభావిత ప్రాంతాల్లో ఉద్విగ్న వాతావరణం కనిపిస్తోంది. లా గువేరా రాష్ట్రం జంట భూకంపాలతో తీవ్రంగా ప్రభావితమైంది. రెస్క్యూ సిబ్బంది ఈ రాష్ట్రంలో పలు ప్రాంతాలకు చేరుకోవడంలో ఆలస్యమవుతుండటంతో బాధితుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఎనిమిది అంతస్తుల భవనం కూలడంతో తన ఐదేళ్ల కుమారుడు, మరికొంతమంది బంధువులు చిక్కుకుపోయారని జెన్నిఫర్ అనే మహిళ వాపోయారు. ప్రభుత్వ సహాయం ఆలస్యమవుతుండటంతో స్థానికులే చాలామందిని రక్షించారని, అయితే భారీ కాంక్రీటు స్లాబులు ఎత్తడానికి క్రేన్లు, భారీ యంత్రాల అవసరం ఉందన్నారు.

**దేశ చరిత్రలోనే అత్యంత ఘోరమైన విపత్తు..**

ఈ ప్రకృతి విపత్తుతో వెనెజువెలాకు ప్రత్యక్షంగా 6.7 బిలియన్ డాలర్ల (రూ.63వేల కోట్ల) మేర నష్టం వాటిల్లిందని ఐరాస అంచనా వేసింది. పరోక్ష ప్రభావాన్నీ లెక్కిస్తే ఇంకా ఎక్కువే ఉండొచ్చని అభిప్రాయపడింది. దీంతో ఆ దేశంలో సంభవించిన అత్యంత ఘోరమైన విపత్తుల్లో ఒకటిగా నిలిచింది. ఇప్పటికే రాజకీయ అస్థిరత, ఆర్థిక సమస్యల కారణంగా వ్యవస్థలు బలహీనపడ్డాయి. ఇప్పుడు విపత్తు కారణంగా పెద్ద సంఖ్యలో ప్రజలు నిరాశ్రయులైనప్పటికీ.. వారికి ఆశ్రయం కల్పించలేని పరిస్థితి నెలకొంది. భూకంపాల తీవ్రత వల్ల ఇళ్లలోకి వెళ్లలేనివారు కార్లలోని నిద్రపోతున్నారు. పార్కుల్లో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. దాదాపు మూడుకోట్ల జనాభా కలిగిన ఆ దేశంలో సగంమందిపైగా పేదరికంలోనే మగ్గిపోతున్నారు. భూకంపాలు రాకముందే 80 లక్షల మంది మానవతా సహాయం అవసరమైన పరిస్థితులున్నాయని గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

## సుడాన్‌లో అంతర్యుద్ధం..

### భారతీయ కంపెనీ, సీఈఓపై అమెరికా ఆంక్షలు

**వాషింగ్టన్ :** ఒక భారతీయ కంపెనీ సహా పలు సంస్థలు, ఎనిమిది మంది వ్యక్తులపై అమెరికా ఆంక్షలు విధించింది. సుడాన్‌లో అంతర్యుద్ధాన్ని ప్రేరేపిస్తున్నారనే ఆరోపణలపై ఈ చర్యలు తీసుకుంది. ఈ మేరకు ఆర్థిక శాఖకు చెందిన ఫారిన్ అసెట్స్ కంట్రోల్ ఆఫీస్ వెల్లడించింది. సూడాన్ సాయుధ దళాలు, రాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ మధ్య ఘర్షణ తీవ్రతరం కావడానికి ఈ సంస్థలు కారణమవుతున్నాయని పేర్కొంది. కొన్నేళ్లుగా ఈ రెండు దళాల మధ్య జరుగుతోన్న ఘర్షణలతో సుడాన్‌లో అంతర్యుద్ధం నడుస్తోంది. దాంతో ప్రపంచంలోనే అతిపెద్ద మానవతా సంక్షోభం ఏర్పడింది. ఆంక్షలు ఎదుర్కొంటున్నవారిలో రాయ్‌పుర్‌కు చెందిన అలోక్ చౌధరీ ఒకరు. అతడు ఎస్‌బీఎల్ ఎనర్జీ లిమిటెడ్‌కు సీఈఓగా ఉన్నారు. దీనికి మరోపేరు అమిన్ ఎక్స్‌ప్లోజివ్ ప్రైవేట్ లిమిటెడ్. ఎస్‌ఏఎఫ్‌కు చెందిన ఆయుధగారాన్ని నిర్వహించే సంస్థకు అమిన్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీ పేలుడు పదార్థాలున్న 200 షిప్‌మెంట్లను సప్లై చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఎస్‌బీఎల్ ఎనర్జీ లిమిటెడ్‌తో పాటు సూడాన్, ఈజిప్ట్ కేంద్రంగా నడుస్తోన్న సంస్థలపై అమెరికా ఆంక్షలు విధించింది. “ఈ సంస్థలు సూడాన్ దళాలకు ఆయుధాలు, పేలుడు పదార్థాలు, విదేశీ ఫైటర్లను సరఫరా చేస్తుండటంతో ఘర్షణ సుదీర్ఘకాలంగా కొనసాగుతోంది. దీంతో మానవతా సంక్షోభం ఏర్పడటమేగాకుండా.. ఉగ్రవాద గ్రూపులు చెలరేగడానికి అవకాశం ఏర్పడింది” అని యూఎస్ విదేశాంగశాఖ ప్రతినిధి టామీ పిగాట్ పేర్కొన్నారు.

## గుట్ట ఈవోగా మరో ఏడాది పాటు భవానీ శంకర్

### పదవీకాలాన్ని పొడిగించిన ప్రభుత్వం

**యాదగిరిగుట్ట, జూన్ 27 :** యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవస్థాన కార్యనిర్వహణ అధికారి భవానీశంకర్ మరో ఏడాదిపాటు కొనసాగనున్నారు. ఆయన ఈవోగా ఈ నెల 30న పదవీ విరమణ చేయాల్సి ఉంది. అయితే ప్రభుత్వం ఆయన పదవీకాలాన్ని ఏడాది పొడిగించింది. ఇవో పదవీ కాలాన్ని పొడిగిస్తున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 30న ఆయన పదవీ విరమణ పొందుతుండటంతో ఆయన పదవీకాలంలో మరోఏడాది వరకు పొడిగించిన్నట్లు వెల్లడించారు. 2027 జూన్ 30 వరకు ఆయన దేవస్థాన ఈవోగా కొనసాగుతారని స్పష్టం చేశారు. పదవీ విరమణ పొందే వరకు పొందిన వేతనంలో పింఛన్ మినహాయించగా మిగిలిన మొత్తం ఆధారంగా వేతనాన్ని నిర్ణయించిన్నట్లు చెప్పారు. గతంలో గవర్నర్‌కు జాయింట్ సెక్రెటరీగా పని చేసిన భవానీశంకర్‌ను దేవస్థాన ఈవోగా నియమిస్తూ ఈ ఏడాది జనవరి 17న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేయగా అదే నెల 29న పదవీ బాధ్యతలు స్వీకరించారు. తాజాగా మరోసారి ఆయన ఈవో పదవిని పొడిగించారు.



## సీషెల్స్ పర్యటనలో వృద్ధ తాబేలును చూడనున్న మోడీ

**న్యూఢిల్లీ, జూన్ 27 :** హిందూ మహాసముద్ర ద్వీపం సీషెల్స్‌లో వచ్చే వారం ప్రధాని మోదీ పర్యటించనున్నారు. ఆ పర్యటన వేళ ఆయన అక్కడ నేషనల్ బోటానికల్ గార్డెన్స్‌ను సందర్శించనున్నారు. షెడ్యూల్ ప్రకారం ఆయన అక్కడ ఓ వృక్షాన్ని నాటనున్నారు. భారత్, సీషెల్స్ మధ్య 50 ఏళ్ల దౌత్య బంధానికి ప్రతీకగా ప్రధాని మోదీ ఈ పర్యటన చేపట్టనున్నారు. సీషెల్స్ జాతీయ దినోత్సవ సంబరాల్లో మోదీ గౌరవ అతిథిగా పాల్గొంటారు. ఇక ప్రపంచంలో ప్రాణాలతో ఉన్న అతి వృద్ధ జంతువును కూడా ప్రధాని మోదీ దర్శించుకోనున్నారు. 1832లో పుట్టిన తాబేలును ఆయన వీక్షించనున్నారు. ఆ తాబేలు పేరు జోనాథన్. ఇప్పుడు అది సుమారు 194 ఏళ్లు ఉంటుందని గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ అంచనా వేసింది. సుమారు రెండు శతాబ్దాలకు చేరుకున్న ఆ జంతువు ఎన్నో చరిత్రాత్మక సందర్భాలకు సాక్షిగా నిలిచింది. వయసు మీరినా ఆ తాబేలు మాత్రం ఆరోగ్యకరంగా ఉన్నట్లు తెలుస్తోంది. వెటరర్నీ డాక్టర్లు దాని ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పరీక్షిస్తున్నారు. అయితే వయసు రీత్యా ఆ తాబేలుకు కంటి చూపు మందగించింది. వాసన గుర్తుపట్టే గుణాన్ని కూడా కొంత కోల్పోయినట్లు తెలుస్తోంది.



## హైదరాబాద్‌లో డోనాల్డ్ ట్రంప్ అవెన్యూ

### భారత్‌కు కృతజ్ఞతలు అంటూ ట్రూత్‌తో ట్రంప్ వెల్లడి

**వాషింగ్టన్, జూన్ 27 :** భారత్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ పక్కనున్న రహదారికి 'డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ' అని పేరు పెట్టిన నేపథ్యంలో ఆయన స్పందించారు. 'ఈ విధంగా గౌరవం పొందిన అమెరికా తొలి అధ్యక్షుడిని నేను. ధన్యవాదాలు భారత్' అంటూ ఆయన తన సామాజిక మాధ్యమ వేదిక 'ట్రూత్'లో పోస్టు చేశారు. అమెరికా 250వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 23న హైదరాబాద్‌లో ఓ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సులేట్ పక్కన ఉన్న రోడ్డుకు 'డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ'గా నామకరణం చేశారు. ఆ ప్రత్యేక ఫలకాన్ని అమెరికా రాయబారి సెర్గియో గోర్‌తో కలిసి తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ఆవిష్కరిం చారు. మెరికాకు చెందిన కీలక టెక్ కంపెనీలు అయిన మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్‌లు ఈ రోడ్డుకు దగ్గర్లోనే ఉన్నాయి. ఈ పేరు మార్పును తెలంగాణ ప్రభుత్వం భారత్-అమెరికా సంబంధాలకు గుర్తింపు గా, అలాగే హైదరాబాద్ అంతర్జాతీయ సాంకేతిక కేంద్రంగా ఎదుగుతున్న నేపథ్యంలో తీసుకున్న ప్రతీకాత్మక నిర్ణయంగా పేర్కొంది. ఈ నేపథ్యంలో ట్రంప్ ధన్యవాదాలు తెలియజేశారు.



## ఎస్ఐఆర్ ప్రక్రియ ను పరిశీలించిన బండి రమేష్, కూకట్‌పల్లి డిసి

**కూకట్‌పల్లి, జూన్ 27, (జనం వార్త) :** కూకట్ పల్లి నియోజకవర్గంలో విస్తృతంగా నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియను టిపిసిసి ఉపాధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ సర్కిల్ ఉప కమిషనర్ ఆంజనేయులుతో కలిసి శనివారం పర్యవేక్షించారు. బాలాజీ నగర్ లో బిఎల్ఓలు బిఎల్ఏలు ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ పత్రాలను ఓటర్లకు అందజేశారు. ఓటర్ పేరుతో ప్రింట్ అయిన రెండు పత్రాలలో ఓటర్ వివరాలను నమోదు చేసిన అధికారులు ఓ పత్రాన్ని ఓటర్ కు ఇవ్వగా మరో పత్రాన్ని తీసుకుని ఓటర్ వివరాలను కంప్యూటర్ లో అప్లోడ్ చేయనున్నారు. ఇక్కడ జరుగుతున్న ఎన్యుమరేషన్ పత్రాల పంపిణీ,ఓటరు వివరాల నమోదును డిసి స్వయంగా పరిశీలించారు. ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో పాల్గొనే పార్టీ నాయకులకు బండి రమేష్ పలు సలహాలు, సూచనలు చేశారు. నియోజవర్గంలో నివసిస్తున్న ప్రతి ఒక్క వ్యక్తి ఓటు నమోదు కావాలని, అదే సమయంలో స్థానికంగా కొంతకాలంగా లేని వారిని గుర్తించి, వారి ఓట్లను తొలగించాలని ఎట్టి పరిస్థితుల్లో దొంగ ఓట్లు నమోదు చేయరాదని అధికారులకు సూచించారు. ఓటర్ నమోదు ప్రక్రియలో పార్టీ కార్యకర్తలు చురుగ్గా పాల్గొనాలని నిర్లక్ష్యంగా వహించిన నాయకులపై పార్టీపరంగా తగు చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా డిసి ఆంజనేయులు మాట్లాడుతూ ఓటర్ నమోదు వివరాలు అత్యంత ఖచ్చితత్వంతో కూడి ఉంటాయని ఎవరి ఓటయినా లేకపోయినా కొత్తగా ఓటరు గా నమోదు కావాలన్నా అధికారులను సంప్రదించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బిఎల్ఓ మౌనిక, బిఎల్ఏ శ్రీకాంత్ ముదిరాజ్, బిఎల్ఓ లక్ష్మీ బిఎల్ఏ ఎండీ జంగీర్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మయ్య,బీ బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు,డివిజన్ అధ్యక్షులు కృష్ణ రాజపుత్, మాజీ కాంగ్రెస్ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి, సునీల్ కుమార్, పిడికిటి గోపాల్ చౌదరి, రంగమోహన్, సుధా స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## టీచింగ్ అండ్ నాన్-టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**మేడ్చల్ :** మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాలోని తెలంగాణ రాష్ట్ర మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్స్, జూనియర్ కాలేజీలలో ఖాళీగా ఉన్న క్రింది టీచింగ్ అండ్ నాన్–టీచింగ్ (ఔట్‌సోర్సింగ్) పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.

మొత్తం ఖాళీల సంఖ్య: 12

పాఠశాలలు అండ్ ఖాళీల వివరాలు:

బాలానగర్ (బాయ్స్ – 1): జూనియర్ లెక్చరర్ (ఇంగ్లీష్), పీ.జీ.టి (మ్యాథ్స్), టి.జీ.టి (ఉర్దూ), నర్సింగ్ ఆఫీసర్.

ఎస్. బాలానగర్ (గర్ల్స్ – 1): అటెండర్ . ఓ.ఎస్

కుత్బుల్లాపూర్ (బాయ్స్ – 1): జూనియర్ లెక్చరర్ (కామర్స్), పీ.జీ.టి (మ్యాథ్స్ అండ్ తెలుగు), నర్సింగ్ ఆఫీసర్.

మేడ్చల్ (బాయ్స్ – 1): జూనియర్ లెక్చరర్ (మ్యాథ్స్), పీ.జీ.టీ (బయో సైన్స్), నర్సింగ్ ఆఫీసర్.

ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు తమ పూర్తి వివరాలతో కూడిన రెజ్యూమ్ ను ఈ క్రింది ఇమెయిల్ ఐడికి (H.No. 3-8-391/A & B Road. No. 05, Suryodaya colony, beside Pathiba High School, Land mark Near Kamineni Hospital, L.B.Nagar, Hyderabad. Pincode: 500068)పంపించాలి.

దరఖాస్తుకు చివరి తేదీ: ఈ నెల 29.

ఇమెయిల్ ఐడి: vinayakaoutsourcingagency@gmail.com

సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు: 080743 08476, 7416553834

ప్రకటించిన వారు: వినాయక ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ.




## చలో కొడంగల్ బ్యానర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే కుంభం

**వలిగొండ :** ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ పిలుపుమేరకు రేపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియోజకవర్గం కొడంగల్ లో జరిగే కృతజ్ఞత ర్యాలీ బ్యానర్ ను ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో స్థానిక శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీ నెరవేర్చినందుకు కేకే కమిటీని నియమించిందని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఇచ్చిన ప్రతిని ప్రతిహామీని నెరవేరుస్తుందని ఆయన అన్నారు. ఉద్యమకారులు చేపట్టే కృతజ్ఞత ర్యాలీ కార్యక్రమం అభినందనీయమని ఫోరం నాయకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కుంభం వెంకట్ పాపిరెడ్డి, ఉపసర్పంచ్ మల్ల మాధవి, ఉద్యమకారుల ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు శీలం స్వామి,కళ్లెం లక్ష్మారెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తిని రవీందర్ గౌడ్, గౌరవ సలహాదారుడు బత్తిని సహదేవ్ గౌడ్, పాశం సత్తిరెడ్డి,ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు పల్సం సతీష్ గౌడ్ , గరిసె రవి,చిలుగూరి సత్తిరెడ్డి, కదిరేని స్వామి, బోడిగె సుదర్శన్,ఐటిపాముల పుష్ప, దండ మల్లికార్జున్, కొండూరు సత్తయ్య, ఎదురుగట్ల పెద్దయాదగిరి, చిన్న యాదగిరి, లక్ష్మయ్య,సందయ్య, తదితర ఉద్యమకారులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ఓటు హక్కును కలిగి ఉండాలి

### మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్తా

**జవహర్ నగర్ :** అర్హులైన ప్రతి ఒక్కరు ఓటు హక్కును కలిగి ఉండాలని జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్తా అన్నారు. శనివారం జవహర్ నగర్ లోని 543, 544, 545 నెంబర్ బూత్ లలో సర్ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ జాబితా సవరణలు ప్రతి ఒక్కరు తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతిరోజు బిఎల్ఓ ఓటర్లకు వివరాల పత్రాలను అందజేస్తారని, ఓటర్లు క్షుణ్ణంగా పరిశీలించి తమ వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. అనంతరం పత్రాలను బిఎల్ఓ కు అందజేయాలని ఆయన తెలిపారు. సర్వే సమయంలో అందుబాటులో లేని వారు ఆగస్టు నెలలో ఆన్లైన్ ద్వారా కానీ, తహసిల్దార్ కార్యాలయంలో ఫామ్ –8 ద్వారా తమ ఓటు హక్కును ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో బిఎల్ఓ లు, బి ఎల్ ఎ లు, స్థానికులు పాల్గొన్నారు.

## కూకట్‌పల్లిలో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన మేడ్చల్ కలెక్టర్

**కూకట్‌పల్లి, జూన్ 27, (జనం వార్త) :** రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా జరుగుతున్న ఓటర్ జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ లో భాగంగా కూకట్ పల్లి నియోజకవర్గం పరిదిలో నిర్వహిస్తున్న ఎస్ ఐ ఆర్ ప్రక్రియ ను కూకట్ పల్లి జోనల్ కమీషనర్ మయాంక్ సింగ్ తో కలిసి మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి పర్యవేక్షించారు.కేపిహెచ్ బి కాలనీ లో బిఎల్ఓలు ఇంటిఇంటికి తిరిగి అందిస్తున్న ఏన్యుమరేషన్ పత్రాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ప్రతీ రోజు ఉదయం బి ఎల్ ఓ ల అటెండెన్స్ తీసుకోవాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశించారు.ఒక్కొక్కరికి ఎన్ని ఎన్రో





ల్మెంట్ పత్రాలు ఇస్తున్నారని, ఎన్రోల్మెంట్ ప్రక్రియను యాప్ లో ఎలా నమోదు చేస్తున్నారని బిఎల్ఓలను అడిగి తెలుసుకున్నారు. ఒక్కరికి రెండు పత్రాలు అందజేస్తున్నామని, క్యూఆర్ కోడ్ ద్వారా యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నామని బిఎల్ఓలు కలెక్టర్‌కు వివరించారు.పత్రాలు ఇచ్చిన తరువాత తప్పనిసరిగా యాప్‌లో అప్‌లోడ్ చేయాలనీ కలెక్టర్ సూచించారు. మ్యాపింగ్ కానీ వారి వివరాలను బిఎల్ఏ లతో సమన్వయం చేసుకుంటూ ఎన్యుమరేషన్ ఫామ్స్ అందించాలని బి ఎల్ ఓ లకు సూచించారు.ఈ కార్యక్రమం లో కూకట్ పల్లి తహసీల్దార్ అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుపై చెత్త వేయవద్దని అడ్డుకున్న పారిశుద్ధ్య కార్మికురాలిపై దాడి

- పారిశుద్ధ్య కార్మికురాలిని జుట్టు పట్టుకొని దాడి చేసిన యువతి
- యువతి పై కేసు నమోదు
- పారిశుద్ధ్య కార్మికులపై దాడి చేస్తే చర్యలు తప్పవు : డి.సి.చాముండేశ్వరి



**కూకట్‌పల్లి, జూన్ 27 (జనం వార్త) :** రోడ్డు మీద చెత్త వేయవద్దని అడ్డుకున్న పారిశుద్ధ్య కార్మికురాలిని ఓ యువతి జుట్టు పట్టుకొని కొట్టిన సంఘటన శనివారం ఉదయం ఆల్విన్ కాలనీ సర్కిల్ పరిధిలో జరిగింది. ఆల్విన్ కాలనీ సర్కిల్ పరిధిలో పలుచోట్ల బహిరంగంగా చెత్త వేసే ప్రాంతాలను గుర్తించి ఆ ప్రాంతాలలోని నివాసితులకు చెత్తను బయట పారవేయకూడదని, ఇంటికి వచ్చే చెత్త బండిలోనే వేయాలని అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అవగాహన కల్పించిన అనంతరం చెత్త వేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులు నిర్ణయించారు. దీంతో చెత్త వేస్తున్న ప్రాంతాలపై పారిశుధ్య కార్మికులు చెత్త వేయకుండా పర్యవేక్షిస్తున్నారు. శనివారం ఉదయం వడ్డేపల్లి ఎంక్లేవ్ దీనబంధు కాలనీ సమీపంలో నాలా పక్కన ఓ యువతి చెత్త వేస్తుండగా అక్కడే ఉన్న పారిశుధ్య కార్మికురాలు మైబు రోడ్డు పక్కన చెత్త వేయద్దని అడ్డుకుంది. దీంతో కోపానికి గురైన ఆ యువతి పారిశుద్ధ్య కార్మికురాలిపై జుట్టు పట్టుకొని దాడి చేసింది. దీంతో పారిశుద్ధ్య కార్మికురాలు ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో పాటు జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ లో దాడి చేసిన యువతి పై ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### పారిశుద్ధ్య కార్మికులపై దాడులు చేస్తే కఠిన చర్యలు తప్పవు :డి.సి.చాముండేశ్వరి.



తమ ఆరోగ్యలను సైతం లెక్క చేయకుండా ప్రతి రోజు పరిసరాలను పరిశుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులపై దాడులు చేస్తే సహించే ప్రసక్తే లేదని ఆల్విన్ కాలనీ డి సి చాముండేశ్వరి హెచ్చరించారు. శనివారము దీనబంధు కాలనీలో పారిశుద్ధ్య కార్మికురాలిపై జరిగిన దాడిపై ఆమె సీరియస్‌గా స్పందించారు. దాడి చేసిన యువతీపై సమీపంలోని పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. బాధితురాలైన పారిశుద్ధ్య కార్మికురాలికి పూర్తి అండగా ఉంటామన్నారు. సర్కిల్ పరిధిలో విధి నిర్వహణలో ఉన్న పారిశుద్ధ్య కార్మికులపై ఎవరైనా దాడులకు దిగితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

## కూకట్‌పల్లిలో ఫుట్‌పాత్ ఆక్రమణల కూల్చివేత

### భారీ పోలీసు బందోబస్తు మధ్య కూల్చి వేసిన అధికారులు

**కూకట్‌పల్లి, జూన్27,(జనం వార్త) :** కూకట్ పల్లి, ఆల్విన్ కాలనీ సర్కిల్ ల పరిది లోని ఫుట్ పాత్ ఆక్రమణలను శనివారం ఉదయం మున్సిపల్ అధికారులు కూల్చి వేసారు. గత కొంత కాలంగా ఫుట్‌పాత్‌ను ఆక్రమించి అక్రమంగా వ్యాపారం నిర్వహిస్తున్న వ్యాపారుల వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు, ప్రయాణికులు అధికారులకు పిర్యాదు చేశారు. స్థానికుల నుండి పిర్యాదులు అధికం కావడంతో శనివారము భారీ పోలీసు బందోబస్తు మధ్య మున్సిపల్ అధికారులు ఫుట్ పాత్ పై ఉన్న ఆక్రమణలను కూల్చివేశారు. కూకట్ పల్లి సర్కిల్ పరిధి హౌసింగ్ బోర్డ్ కాలనీ ఎమ్మార్వో కార్యాలయం రోడ్డు లోని రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న వీధి వ్యాపారులదుకాణాలను, ఆల్విన్ కాలనీ సర్కిల్ నిజాంపేట్ రోడ్ లోని మిత్ర హిల్స్‌లో రోడ్డుపై ఆక్రమణలను మున్సిపల్ సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారు



లు మాట్లాడుతూ రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తొలగించిన దుకాణాల స్థానంలో తిరిగి మళ్లీ ఆక్రమణలు చేపట్టినచో చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని అధికారులు ఆక్రమణ దారులను హెచ్చరించారు.





## సత్యదేవుని ఆలయానికి విరాళాల వెల్లువ

**అన్నవరం :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానానికి భక్తుల నుండి విరాళాలు అందుతున్నాయి. దేవస్థానం నిర్వహిస్తున్న వివిధ అన్నదాన పథకాలకు భక్తులు ఉదారంగా విరాళాలు సమర్పించారు. ఈనెల 28న నిర్వహించనున్న అన్నదాన కార్యక్రమం కోసం ఆర్.వి.ఎల్.ఎన్.ఎన్.ఎస్. పార్థసారథి రూ.1 లక్ష విరాళాన్ని అందజేశారు. అలాగే, జూన్ 19న నిర్వహించిన అన్నదాన కార్యక్రమం కోసం జడుపు అన్నదాన ప్రసాద పథకానికి హైదరాబాద్ తార్నాక నివాసి నవీన్ రూ.1,01,116 విరాళాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు దాతలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, భక్తులు అన్నదాన సేవల్లో భాగస్వాములు కావాలని కోరారు.





## సర్ ప్రక్రియను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి

**మేడ్చల్ :** ఓటర్ల జాబిత ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా శనివారం కీసర మండలంలోని యాద్గార్ పల్లిలో జరుగుతున్న సర్ ప్రక్రియను జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి పర్యవేక్షించారు. బిఎల్ఓ లు ఇంటింటికి అందిస్తున్న ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్ని ఎన్రోల్ మెంట్ పత్రాలు ఇచ్చారని, ఒక్కొక్కరికి ఎన్ని ఎన్రోల్ మెంట్ పత్రాలు ఇస్తున్నారని, ఎన్రోల్ మెంట్ యాప్ ద్వారా ఆప్ లోడ్ చేసే ప్రక్రియను బిఎల్ఓను అడిగి తెలుసుకున్నారు. ఒక్కొక్కరికి రెండు పత్రాలు అందజేస్తున్నామని, సెల్ ఫోన్ లో క్యూఆర్ కోడ్ ద్వారా అప్ లోడ్ చేస్తున్నామని బిఎల్ఓలు వివరించారు. పత్రాలు ఇచ్చిన తరువాత తప్పనిసరిగా యాప్ లో అప్ లోడ్ చేయాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ పర్యటనలో కీసర తహాసీల్దార్ యాదగిరిరెడ్డి, ఆర్ఐ మహేందర్, బిఎల్ఓలు, పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.



## లక్ష్మీనారాయణ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

**ఉప్పల్ :** ఉప్పల్ డివిజన్ పరిధిలోని లక్ష్మీనారాయణ కాలనీలో రూ.90 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. శనివారం మాజీ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా రజిత పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, కాలనీవాసులు ఎదుర్కొంటున్న రోడ్డు సమస్యలను తన దృష్టికి తీసుకురావడంతో వెంటనే సంబంధిత అధికారులతో సమన్వయం చేసి సీసీ రోడ్డు పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనే తమ ప్రధాన లక్ష్యమని, అభివృద్ధి పనులు నాణ్యతతో, వేగవంతంగా పూర్తయ్యేలా నిరంతరం పర్యవేక్షిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ కాలనీ అధ్యక్షుడు లూకాస్, సురేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, మురళి రెడ్డి, నాగరాజు, సుధాకర్, హరి, అశోక్ గౌడ్, నిరంజన్, నాగేశ్వరరావు, రవి వర్మ, దుర్గాప్రసాద్, రామారావు, వల్లూరి శ్రీను, అచ్చిరెడ్డి, పెద్ద ప్రసాద్, చిన్న ప్రసాద్, మధుబాబు, పరమేష్, మీసాల రాములు, బ్రహ్మాచారి, బిక్షపతి, నరసింహాచారి, శ్రీహరిచారి, పాండురంగాచారి, రాజు, కృష్ణ, మోహన్ బాబు, నాగేష్, ఇస్మాయిల్, ఖాదర్ వల్లి, మదర్, భాస్కర్ దాస్, వేణు, వెంకటేష్, సీహెచ్ కుమార్, నాగేశ్వరరావు, సీసీ రెడ్డి, సల్ల ప్రభాకర్ రెడ్డి, సందీప్, భాస్కర్ తదితరులతో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.



## వర్షాకాల వ్యాధులపై అవగాహన

**దేవరుప్పుల :** స్థానిక దేవరుప్పుల గ్రామపంచాయతీ వద్ద తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు నిర్వహించిన కళాజాత కార్యక్రమం ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ (డీపీఆర్ఓ) అధికారి పల్లవి ఆధ్వర్యంలో ఈ అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళాకారులు తమ పాటలు, చిన్న నాటికల ద్వారా పలు కీలక అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా, ప్రస్తుతం జరుగుతున్న ఓటరు జాబితా సవరణ సర్వే ప్రాధాన్యతను ప్రజలకు వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, జాబితాలో తప్పులుంటే వెంటనే సరిదిద్దుకోవాలని సూచించారు. దీనితో పాటు, ప్రస్తుత వర్షాకాలంలో ప్రబలే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కళాకారులు హెచ్చరించారు. పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణ, సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను తమ ప్రదర్శనల ద్వారా కళ్లకు కట్టినట్లు చూపించారు. వినోదంతో పాటు విజ్ఞానాన్ని అందించిన ఈ కార్యక్రమానికి గ్రామస్థులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## రావి నారాయణరెడ్డినగర్ కమ్యూనిటీ హాల్ డెవలప్మెంట్ కమిటీ అధ్యక్షునిగా నిమ్మల నరసింహులు

**జవహర్ నగర్ :** జవహర్ నగర్ లోని సిపిఐ కాలనీ, రావి నారాయణరెడ్డి నగర్ కమ్యూనిటీ హాల్ డెవలప్మెంట్ కమిటీని బస్తి నాయకులు ఎనుకున్నారు. సలహాదారులుగా సిపిఐ పార్టీ సీనియర్ నాయకులు, బస్తీ ఫౌండర్ సిహెచ్ దశరథ్, మాజీ ఎంపీటీసీ సభ్యులు శంకర్, వి. నాగేశ్వరమ్మ, అధ్యక్షులుగా నిమ్మల నరసింహులు, ఉపాధ్యక్షులుగా కే. అశోక్, ప్రధాన కార్యదర్శిగా వి. ప్రసాద్ సహాయ కార్యదర్శిగా డి. యాదగిరి, ప్రచార కార్యదర్శిగా వి. స్వరూప నాయక్, కోశాధికారిగా పి. నరసింహ, కమిటీ సభ్యులుగా కే. గణేష్, ఎల్లయ్య, ఎల్లమ్మ, జయమ్మ, ఆంజనేయులు, కొండయ్య ,సురేష్ లను ఎన్నుకున్నారు. బస్తీ వాసుల సహాయ సహకారాలతో కమ్యూనిటీ హాల్ ను అభివృద్ధి చేయాలని సమావేశంలో తీర్మానించారు.



## హర్మ్యూజ్‌లో మరో ట్యాంకర్‌పై క్షిపణి దాడి

**ఇరాన్ :** అమెరికా–ఇరాన్‌ల ప్రతీకార దాడులతో హర్మ్యూజ్‌లో మరోసారి ఉద్రిక్తతలు నెలకొంటున్నాయి. తాజాగా జలసంధిలో ప్రయాణిస్తున్న ఓ ట్యాంకర్ ను క్షిపణి తాకినట్లు యూకే మిలిటరీ వెల్లడించింది. ఆ నౌకకు నష్టం వాటిల్లినప్పటికీ.. సిబ్బంది అందరూ సురక్షితంగా ఉన్నారని పేర్కొంది. అయితే ఆ క్షిపణిని ఎవరు ప్రయోగించారనే విషయంపై స్పష్టత రాలేదు. అమెరికా–ఇరాన్‌లు శాంతి ఒప్పందంపై సంతకాలు చేయడంతో హర్మ్యూజ్‌లో ఇటీవల నౌకాయానం తిరిగి ప్రారంభమైంది. కొన్ని నెలలుగా అక్కడే నిలిచిపోయిన అనేక వాణిజ్య నౌకలు తమ ప్రయాణాన్ని మొదలుపెట్టాయి. ఈ క్రమంలోనే కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ అమెరికా, ఇరాన్‌లు దాడులను మొదలుపెట్టాయి. డ్రోన్లు, క్షిపణి దాడులతో జలసంధిలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.



## సుదీర్ఘ భూవివాదాన్ని ముగించిన సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ :** ఓ భూమి కొనుగోలు విషయంలో దాదాపు ఏడు దశాబ్దాలుగా కొనసాగుతున్న వివాదానికి సుప్రీం కోర్టు ముగింపు పలికింది. 1957లో చేసుకున్న ఓ సేల్ డీడ్‌ను సమర్థిస్తూ న్యాయస్థానం తీర్పు వెలువరించింది. అయితే, ఈ కేసు తీర్పు వెలువరించిన న్యాయమూర్తులు జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, ఎన్‌వీ అంజారియాలు జన్మించక ముందు నాటి వివాదం కావడం గమనార్హం. ఉత్తరాఖండ్ హరిద్వార్‌లోని నర్సీపుర్ కలాన్ గ్రామంలో 15.5 బిఘాల భూమిని సరాఫత్ అలీ అనే వ్యక్తి పూర్వీకులు 1957 జూన్‌లో సేల్‌డీడ్ ద్వారా కొనుగోలు చేశారు. అప్పటినుంచి తమ స్వాధీనంలోనే ఉందనేది వారి వాదన. 1980ల్లో ఓసారి మ్యుటేషన్ కోసం దరఖాస్తు చేసుకోగా రెవెన్యూ అధికారులు అందుకు అంగీకరించారు. కానీ, 1991లో భూముల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ సమయంలో.. రికార్డుల్లో యజమానులుగా అమ్మిన వారి పేర్లే కనిపించాయి. దీంతో బాధితులు పై అధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే, నాటి భూచట్టానికి అనుగుణంగా కొనుగోలు జరగలేదని, సాక్షి వివరాల్లో వ్యత్యాసాలు ఉన్నాయని చెబుతూ మ్యుటేషన్‌ను తిరస్కరించారు. 1957నాటి సేల్ డీడ్ చెల్లదన్నారు. దీంతో బాధితులు హైకోర్టును ఆశ్రయించారు. న్యాయస్థానం కూడా అధికారుల నిర్ణయాన్ని సమర్థించడంతో ఈ వ్యవహారం సుప్రీం కోర్టుకు చేరింది. విచారించిన సుప్రీం ధర్మాసనం.. సాక్ష్యాల్లో చిన్న వ్యత్యాసాల ఆధారంగా సేల్‌డీడ్‌ను కొట్టివేయడం సరైంది కాదని పేర్కొంది. ఈ సందర్భంగా 1957లో చట్టబద్ధంగా రిజిస్టరైన డీడ్‌ను సమర్థిస్తూ కొనుగోలుదారులకు అనుకూలంగా తీర్పు వెలువరించింది. అయితే, కేసు విచారణ క్రమంలోనే సరాఫత్ చనిపోగా.. అతడి చట్టబద్ధ వారసులు ఈ కేసుపై సుప్రీం కోర్టులో న్యాయపోరాటం చేశారు. దీంతో నాలుగు తరాలుగా కొనసాగిన ఈ వివాదం పరిష్కారమైనట్లైంది.



## రౌడీయిజం చేసేందుకే వైకాపా నేతల అమరావతి పర్యటన : అనిత

**అమరావతి:** రైతులపై రౌడీయిజం చేసేందుకే వైకాపా నేతలు అమరావతి వెళ్లారని ఏపీ హోంశాఖ మంత్రి అనిత అన్నారు. ఇది ముమ్మాటికీ అమరావతి రైతులపై రౌడీ మూకలతో చేసిన దాడేనని ఆక్షేపించారు. రాజధానిలో వైకాపా నేతల పర్యటన ఉద్రిక్తతలకు దారి తీసిన సంగతి తెలిసిందే. ఉండవల్లిలో రాజధాని రైతులు, వైకాపా నేతల మధ్య తోపులాట చోటు చేసుకుంది. ఈ ఘటనపై అనిత స్పందించారు. జరిగిన ఘటనపై అధికారులను అడిగి సమాచారం తెలుసుకున్నట్లు చెప్పారు. "తెదేపా ఆఫీసుపై దాడి చేసిన గూండాలే రైతులపై దాడికి వచ్చారు. అమరావతి వెళ్లిన వారందరి విజువల్స్ ఉన్నాయి. వైకాపా నేతలకు అమరావతిలో పర్యటించే నైతిక అర్హత లేదు. రైతులను పరామర్శించేందుకు వెళ్లారా? రౌడీయిజం చేసేందుకు వెళ్లారా? వైకాపా నేతలు వెళ్తే సమస్య వస్తుందని పోలీసులు ముందే చెప్పినా వినిపించుకోలేదు. వైకాపా నేతల పర్యటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపిస్తాం. పెనుమాకలో 90శాతం రైతులు రాజధానికి భూములిచ్చారు. వైకాపా నేతలు ఇచ్చిన ఫిర్యాదులపైనా విచారణ చేస్తాం" అని అనిత అన్నారు. ప్రజల కలల రాజధాని అమరావతి శరవేగంగా ముందుకెళ్తోందని అనిత అన్నారు. రాజధాని నిర్మాణాన్ని 2027 నాటికి పూర్తి చేయాలని అహర్నిశలు కష్టపడుతున్నామని తెలిపారు. "ఆనాడు మూడు రాజధానుల పేరుతో డ్రామా ఆడారు. ఇప్పుడు మావిగన్ అంటూనే రాజధానికి ఎలా వస్తారు? అమరావతి పూర్తయితే మనుగడ ఉండదనే వైకాపా డ్రామాలు ఆడుతోంది. వైకాపా అరాచకాలపై అమరావతి రైతులు ఆగ్రహంతో ఉన్నారు" అని తెలిపారు.

# యేసుక్రీస్తు అందరికీ ప్రభువు

- క్రీస్తుయేసు యొక్క మంచి సైనికుల బృందం
- డానియెల్ వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో..
- అర్వపల్లి, నాగారం మండలాల్లో ఘనంగా బహిరంగ సువార్త



**సూర్యాపేట్, జూన్ 27 (జనం వార్త) :** తన ప్రజలను వారి పాపములనుండి ఆయనే రక్షించును గనుక ఆయనే యేసు అని పేరు పెట్టుదువు అని వ్రాయబడినది. అని దైవజనులు కాలేబు (హెబ్రోను) అన్నారు. "క్రీస్తుయేసు మంచి శిష్యుల బృందం" ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా అర్వపల్లి,నాగారం మండల పరిధిలోని పలు గ్రామాలలో దేవుని సేవకులు (హెబ్రోన్) కాలేబు నేతృత్వంలో బహిరంగ సువార్త పరిచర్య ఘనంగా నిర్వహించారు. ప్రభువైన యేసు బహిరంగ సువార్త పరిచర్యను వర్షం వచ్చిన విశ్వాసులు వెనకంజ వేయక "దేవుని నీతిగల దక్షిణ హస్తం" తోడైయున్నందున సువార్తను విజయవంతంగా ముందుకు కొనసాగించారు. ఈ సందర్భంగా దైవ సేవకులు సువార్తలో మాట్లాడుతూ యేసుక్రీస్తు అందరికీ ప్రభువు అన్నారు. యేసురక్తము ప్రతి పాపము నుండి మనలను పవిత్రులనుగా చేయునని అన్యజనులకు తెలియజేశారు. యేసు నేనే: మార్గమును, సత్యమును, జీవమును నా ద్వారానే తప్ప ఎవడును తండ్రి యొద్దకు రాడు అని స్పష్టంగా తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో సేవకులు ప్రభుదాస్, ఐజాక్, నతనియల్, సైమన్ పీటర్ నాయక్, ఫిలిప్ రాజు, చంద్రశేఖర్, అభిషేక్, కాలేబు, తిమోతి, వెంకట్ రెడ్డి, మనష్యే, దేవదాసు, సుధీర్, గొంగళ్ల సునీల్ బృందం తదితరులు పాల్గొన్నారు.





# నాలుగు జిల్లాల తలరాత మార్చే వెలిగొండ

- భూములు ఇచ్చిన రైతులు త్యాగం మరువలేనిది
- తొలివిడతలో నిర్వాసితులకు 300 కోట్ల పరిహారం
- కృష్ణాజలాలు వస్తాయని ఎవ్వరూ ఊహించలేదు
- గత ప్రభుత్వ పూర్తిచేయకుండానే ప్రారంభోత్సవం
- వెలిగొండ ప్రాజెక్టు ద్వారా లక్షల ఎకరాలకు సాగునీరు
- నిర్వాసిత రైతులతో సిఎం చంద్రబాబు భేటీ



**మార్కాపురం, జూన్ 27 :** నాలుగు జిల్లాల తలరాతలు మార్చే ప్రాజెక్టు వెలిగొండ అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. వెలిగొండ ప్రాజెక్టుకు భూములు ఇచ్చిన రైతుల త్యాగాలు వృథా కావని చంద్రబాబు అన్నారు. మార్కాపురం జిల్లా పర్యటనలో భాగంగా వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ పనులను పరిశీలించిన అనంతరం నిర్వాసితులు, లబ్దిదారులతో సీఎం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. శనివారం దోర్నాల మండలం గంటావానిపల్లిలో వెలిగొండ ప్రాజెక్ట్ నిర్వాసితులు, రైతులతో సీఎం సమావేశమయ్యారు. అనంతరం మాట్లాడుతూ.. నీళ్లు లేక చాలా మంది ఫ్లోరైడ్ వాటర్ తాగుతున్నారని.. కృష్ణా నదీ జలాలు ఈ ప్రాంతానికి వస్తాయని ఎవరూ ఆలోచన చేసి ఉండరని తెలిపారు. రాయలసీమ, మార్కాపురం ప్రాంతానికి కృష్ణా జలాలు తీసుకురావాలని ఎన్టీఆర్ ఆలోచన చేశారని గుర్తుచేశారు. 1996 మార్చి 26న వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రారంభించామని.. రూ.900 కోట్లు పునరావాసం కోసం కేటాయించామని అన్నారు. రూ.300 కోట్లు మొదటి విడతలో నిర్వాసితులకు ఇస్తున్నామని చెప్పారు. ఏపీలో చాలా ఇబ్బందులు ఉన్నాయని సీఎం అన్నారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వొచ్చు. సుంకేశుల గ్యాప్ పనులను 1998లోనే ప్రారంభించాం. గత ప్రభుత్వాలు కూడా మాలాగే చేసుంటే పరిస్థితి మరోలా ఉండేది. మార్కాపురం జిల్లాలో పండ్ల తోటలు బాగా రావాలన్నారు. భూములు ఇచ్చిన రైతుల త్యాగం గొప్పది. మీరు ఇచ్చిన భూముల వల్ల నాలుగైదు జిల్లాలు బాగుపడతాయి. వెలిగొండ నీళ్లు వచ్చాక చుట్టుపక్కల భూముల విలువ పెరుగుతుంది. మాది ప్రజా ప్రభుత్వం.. అందరికీ లబ్ది చేకూరుస్తాం. కరవు జిల్లా పరిస్థితులు తెలిసిన కలెక్టర్‌ను నియమించామని సీఎం తెలిపారు. మోసాలు చేయడంలో గొడ్డలి పార్టీ నేతలు దిట్ట. వైకాపా నేతలు కళ్లు ఆర్పకుండానే అబద్దాలు చెబుతున్నారు. ఆ పార్టీ నేతలు ఇప్పుడు వితండవాదం చేస్తున్నారు. వెలిగొండ పేరుతో వైకాపా ప్రభుత్వం అనేక మోసాలు చేసింది. టన్నెల్–2లో బోరు ఇరుక్కు పోయినా ప్రాజెక్టును ప్రారంభించేశారని మండిపడ్డారు. నక్సలిజంపై పోరాటం చేశానని.. క్లైమోర్ బాంబులు పెడితే వేంకటేశ్వరస్వామి తనను కాపాడారన్నారు. గత పాలకులు రూ.10 లక్షల కోట్లు అప్పులు పెట్టిపోయారని విమర్శించారు. 3,351 వెలిగొండ నిర్వాసిత కుటుంబాలకు రూ.300 కోట్లు జమ చేశామన్నారు. నిర్వాసితుల త్యాగం వృథా కాదని.. అందరికంటే మెరుగైన జీవితం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. వెలిగొండ ప్రాజెక్టుపై ఈ టర్మ్‌లో రూ.3,900 కోట్ల వ్యయం అవుతోందన్నారు. 2027 నాటికి మిగిలిన పనులన్నీ పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఫేజ్–1, ఫేజ్–2 పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఇడుపూరు, గోగులదిన్నె, తోకపల్లి తదితర పునరావాస కాలనీల్లో మౌలిక వసతులు పూర్తి చేశామన్నారు. మార్కాపురానికి ప్రత్యేక జిల్లా ఇచ్చామని.. కలెక్టరేట్ కూడా పునరావాస కాలనీ పక్కనే వస్తుందని తెలిపారు. పునరావాస కాలనీ భవిష్యత్తులో ఆదర్శ టౌన్‌షిప్‌గా అభివృద్ధి చెందుతుందని అన్నారు. 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు.. 23 లక్షల మందికి తాగునీరు అందేలా వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం జరుగుతోందని సీఎం తెలిపారు. 43.5 టీఎంసీల నీటిని వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. సుంకేసుల, గొట్టిపడియ డ్యామ్‌లకు రూ.120 కోట్ల పరిపాలనా అనుమతి ఇచ్చామని.. రూ.98 కోట్లతో సుంకేసుల పనులను ప్రారంభించినట్లు చెప్పారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లే వెలిగొండ ఆలస్యమైందని విమర్శించారు. పదేళ్ల ముందే ప్రాజెక్టు పూర్తయి ఉంటే రైతుల జీవితాలు మారిపోయేవన్నారు. గొడ్డలి పార్టీ మోసాలు డిజిటల్ మోసాలుగా ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఎన్నికల ముందు డ్రామాలు, మోసాలతో ప్రజలను తప్పుదోవ పట్టించారని మండిపడ్డారు. డిజిటల్ అరెస్ట్ మోసాల తరహాలో వైసీపీ మోసాలు అంటూ దుయ్యబట్టారు. 2024లో కేటాయించిన నిధులను గత ప్రభుత్వం సరిగా వినియోగించలేదన్నారు. టన్నెల్–2లో యంత్రం చిక్కుకుపోయినా తొలగించకుండా ప్రారంభోత్సవం చేశారని విమర్శించారు. నిర్వాసితులకు న్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రాజెక్టుల కోసం భూములు ఇచ్చిన రైతులకు నష్టం జరగనివ్వమని.. బాధిత రైతులందరికీ న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యత అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.



వెలిగొండ ప్రాజెక్టుతో నాలుగు జిల్లాల అభివృద్ధి, భూముల విలువ పెరుగుతుందని చెప్పారు. ప్రతి నిర్వాసిత కుటుంబానికి పూర్తి న్యాయం చేస్తామన్నారు. వెలిగొండ పెండింగ్ బిల్లులన్నీ చెల్లించామని తెలిపారు. మార్కాపురం జిల్లాకు కరువు పరిస్థితులు తెలిసిన కలెక్టర్‌ను నియమించామని.. ఈ ప్రాంతంలో హార్టికల్చర్‌కు పెద్దపీట వేస్తామన్నారు. మార్కాపురాన్ని హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేస్తామని అన్నారు. హార్టికల్చర్ అభివృద్ధికి రూ.1 లక్ష కోట్ల ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. రూ.40 వేల కోట్లు ప్రభుత్వం, రూ.60 వేల కోట్లు ప్రైవేట్ పెట్టుబడులు పెట్టనున్నట్లు వెల్లడించారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలతో స్థానిక యువతకు ఉద్యోగాలు లభిస్తాయన్నారు. ఎఫ్‌పీఓల ద్వారా రైతుల ఆదాయం పెంచే చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. రామాయపట్నం పోర్టు, ఎయిర్‌పోర్ట్‌తో ఎగుమతులకు అవకాశముందని సీఎం అన్నారు. రోడ్లు, రైల్వే కనెక్టివిటీతో ప్రాంత అభివృద్ధి వేగవంతం చేస్తామన్నారు. అన్నదాత సుఖీభవ పథకంలో రైతులకు ఏడాదికి రూ.20 వేల సాయం అందిస్తున్నామని.. మైక్రో ఇరిగేషన్‌కు మళ్లీ ప్రోత్సాహం అందిస్తామన్నారు. సాగునీటి ప్రాజెక్టులకు రూ.24 వేల కోట్లు ఖర్చు చేశామన్నారు. హంద్రీ–నీవా పూర్తి చేసి చివరి ప్రాంతాలకు నీళ్లు అందించామని వెల్లడించారు. పోలవరం ఆలస్యం వల్ల రాష్ట్రంపై భారీ ఆర్థిక భారం పడిందన్నారు. అమరావతిని నిలిపివేయడం రాష్ట్రానికి నష్టమన్నారు. 29 వేల మంది రైతులు 33 వేల ఎకరాలు స్వచ్ఛందంగా ఇచ్చారని గుర్తుచేశారు. రాష్ట్ర అభివృద్ధికి రాజధాని అత్యంత కీలకమన్నారు. తెలంగాణ అభివృద్ధి కోసం హైదరాబాద్‌ను తీర్చిదిద్దామని అన్నారు. వెలిగొండ ప్రాజెక్టుతో రైతుల జీవితాలు మారతాయని ధీమా వ్యక్తం చేశారు. జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తున్నామన్నారు. కులం, మతం ఆధారంగా కాకుండా అభివృద్ధిని చూసి ఓటు వేయాలని అన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలోనే మార్కాపురం అభివృద్ధి జరిగిందని చంద్రబాబు తెలిపారు. తుంగభద్ర డ్యాం గేట్ల మరమ్మతులతో నీటి వృథాను అడ్డుకున్నామన్నారు. 33 కొత్త గేట్లను ఏర్పాటు చేసి ముగ్గురు ముఖ్యమంత్రులం జాతికి అంకితం చేశామని తెలిపారు. గంగా, కావేరి నదుల అనుసంధానం అవసరమన్నారు. దేశంలో విద్యుత్ గ్రిడ్ వ్యవస్థతో విద్యుత్ కొరత సమస్య తగ్గిందని చెప్పారు. సెల్‌ఫోన్ విప్లవం వల్ల ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరువయ్యాయన్నారు. రైతుల్లో అభివృద్ధి దిశగా ఆలోచనా విధానం మారాలని సూచించారు. 2027 కల్లా పోలవరం పూర్తి చేస్తామని ప్రకటించారు. అక్కడి నుంచి నల్లమల సాగర్‌కు నీళ్లు తీసుకువస్తామన్నారు. అవసరమైతే నల్లమల సాగర్ నుంచి లిఫ్ట్ పెట్టి కావేరికి కూడా నీళ్లు ఇవ్వొచ్చన్నారు. దీని వలన ఐదు నదులు అనుసంధానం అవుతాయని.. నాలుగు రాష్ట్రాలు బాగుపడ తాయని చెప్పుకొచ్చారు. 'మార్కాపురం జిల్లా అభివృద్ధి చేసే బాధ్యత నాది. మీ కంటికి కనిపించే నాయకుల్ని చూడొద్దు.. నన్ను చూడండి, పార్టీని చూడండి, ఎన్డీయే కూటమిని చూడండి. మీ ఆమోదం లేకపోతే ఎవరినీ నేను ఆమోదించను. అందరూ ఆమోదించే వ్యక్తి దొరకడం కూడా కష్టమే. పోలవరం నిర్వాసితులు త్యాగం చేశారు. అందుకే ఒకే నియోజకవర్గానికి ఒక జిల్లా ఇచ్చాను. వెలిగొండ ప్రాజెక్టు రైతులు రాష్ట్రానికి ఆదర్శం' అని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుకు జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఉన్నతాధికారులు ఈ పర్యటనలో పాల్గొన్నారు.

# యూఎస్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ..

## సెమీస్‌లో యువ సంచలనం రౌనక్



యూఎస్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్లు అదరగొట్టేస్తున్నారు. మహిళలు, పురుషుల విభాగంలో ముగ్గురు ప్లేయర్లు సెమీస్‌కు దూసుకెళ్లారు. మహిళల సింగిల్స్‌లో దేవికా సిహాగ్ విజయం సాధించగా.. పురుషుల విభాగంలో కిదాంబి శ్రీకాంత్, రౌనక్ చౌహాన్ సెమీఫైనల్స్‌లో అడుగు పెట్టారు. 18 ఏళ్ల రౌనక్ చౌహాన్ ఇప్పుడు బ్యాడ్మింటన్‌లో హాట్ టాపిక్‌గా మారాడు. ప్రిక్వార్టర్‌ఫైనల్స్‌లో ఆరో ర్యాంకర్‌ను ఓడించిన రౌనక్.. క్వార్టర్స్‌లోనూ దూకుడు కొనసాగించాడు. కేవలం 38 నిమిషాల్లోనే ఇజ్రాయెల్‌కు చెందిన ఒలింపియన్ ప్లేయర్ మిషా జిల్బర్‌మన్‌ను చిత్తు చేశాడు. 23-21, 21-11 తేడాతో విజయం సాధించాడు. దీంతో తొలిసారి మెగా టోర్నీ సెమీస్‌లో అడుగు పెట్టాడు. మరో సింగిల్స్‌లో సీనియర్ ప్లేయర్ కిదాంబి శ్రీకాంత్ 21-9, 12-21, 21-8 తేడాతో చైనీస్ తైపీ ప్లేయర్ లియావో జౌపుపై విజయం సాధించాడు. ఇవాళ జరగనున్న సెమీస్‌లో జపాన్‌కు చెందిన నాలుగో సీడ్ యుదై ఒకిమోటోతో శ్రీకాంత్ తలపడతాడు. మహిళల విభాగంలో దేవికా 22-20, 21-19 తేడాతో మూడో సీడ్ జపాన్ ప్లేయర్ రికో గున్‌జిపై గెలిచింది.



# బిజినెస్




## రానున్న రెండేళ్లలో.. 500 సిటీల్లో భారత్ ట్యాక్సీ సేవలు

### కేంద్రమంత్రి అమిత్ షా

**న్యూఢిల్లీ :** ప్రైవేటు ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలపై కేంద్రమంత్రి అమిత్ షా ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన భారత్ ట్యాక్సీని తరిమికొట్టేందుకు కొన్ని ప్రైవేట్ రవాణా సేవా సంస్థలు ఛార్జీలను తగ్గిస్తున్నాయని పేర్కొన్నారు. ఆయా కంపెనీలు నష్టాల్లో ఉన్నా కూడా.. భారత్ ట్యాక్సీ పతనమే లక్ష్యంగా అక్రమ రీతిలో పోటీ విధానాలు పాటిస్తున్నాయని మండిపడ్డారు. అయినప్పటికీ.. ఈ విషయంలో వెనుకడుగు వేసేది లేదన్నారు. మరో రెండేళ్లలో భారత్ ట్యాక్సీ సేవలను దేశవ్యాప్తంగా 500కు పైగా సిటీల్లో అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. గుజరాత్‌లోని 14 ప్రధాన నగరాల్లో భారత్ ట్యాక్సీ సేవలను ప్రారంభించిన అనంతరం షా ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్ ట్యాక్సీ యాప్‌లో ఛార్జీలు ఎక్కువగా ఉన్నాయని వస్తున్న వార్తలు నిజం కాదని.. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కొందరు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని అమిత్ షా ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత్ ట్యాక్సీ సేవలు ప్రారంభమైన నగరాల్లో ప్రైవేటురంగ ట్యాక్సీ సంస్థలు డ్రైవర్లకు అధిక కమీషన్లు ఇవ్వడం.. ఈ సేవలు మార్కెట్లోకి ప్రవేశించకుండా ఆపడానికి ఛార్జీలను తగ్గించడం వంటి అక్రమ మార్గాలను అవలంభిస్తున్నాయని పేర్కొన్నారు. ఎవరెన్ని చేసినా భారత్ ట్యాక్సీలను అడ్డుకోలేరని స్పష్టం చేశారు. ప్రైవేట్ కంపెనీలు తమ సొంత లాభం కోసం డ్రైవర్లను, వినియోగదారులను ఇద్దరినీ దోపిడీ చేస్తున్నాయని అమిత్ షా విమర్శించారు. వినియోగదారులు ఫిర్యాదు చేస్తే.. డ్రైవర్ మాట వినకుండా వెంటనే వారి రిజిస్ట్రేషన్ రద్దు చేస్తున్నాయని దుయ్యబట్టారు. అటువంటి కంపెనీల దోపిడీ విధానాన్ని అంతం చేయడానికే భారత్ ట్యాక్సీని తీసుకువచ్చామన్నారు.



## వైభవ్ సూర్యవంశీలో ఆ సత్తా ఉంది : వెంగ్‌సర్కార్

ఐర్లాండ్‌తో తొలి టీ20లో వైభవ్ సూర్యవంశీ బరిలోకి దిగుతాడని అంతా భావించారు. కానీ, మేనేజ్‌మెంట్ అతడికి అవకాశం ఇవ్వలేదు. వన్‌డౌన్ బ్యాటర్ ఇషాన్ కిషన్‌తోపాటు సంజు శాంసన్ విఫలమై నిరాశపరిచారు. దీంతో వైభవ్‌కు ఛాన్స్ ఇవ్వాలనే డిమాండ్లు ఎక్కువైపోయాయి. అలాగే అతడు కేవలం టీ20లు మాత్రమే ఆడగలడని.. వన్డేలు, టెస్టులకు పనికిరాడంటూ కొందరు చేసిన వ్యాఖ్యలను మాజీ క్రికెటర్ దిలీప్ వెంగ్‌సర్కార్ కొట్టిపడేశాడు. వైభవ్‌కు ఆ సత్తా ఉందని స్పష్టం చేశాడు. ఐర్లాండ్‌తో రెండో టీ20లో అతడికి ఛాన్స్ వచ్చే అవకాశం ఉందన్నాడు. "తప్పకుండా వైభవ్‌కు ఐర్లాండ్‌తో రెండో టీ20లో అవకాశం వస్తుంది. ఒక్కసారి బరిలోకి దిగాడంటే.. రెండు చేతులతో అందిపుచ్చుకుంటాడు. అసాధ్యమనుకునే షాట్లు కొడుతున్నాడు. అతడిలో గొప్ప ప్రతిభ ఉంది. బ్యాట్‌ను వినియోగించే తీరు బాగుంది. టీ20 ఫార్మాట్ అతడికి భలేగా సూట్ అయింది. భవిష్యత్తులో అతడు మూడు ఫార్మాట్లలోనూ ఆడతాడా? అంటే ఇప్పుడే ఆ అవకాశాలపై చెప్పలేం. ప్రస్తుతం అతడు పరిమిత ఓవర్ల క్రికెట్‌ను మాత్రమే ఆడుతున్నాడు. ఇంకా అతడి సుదీర్ఘ ఫార్మాట్ ఆటను చూడలేదు. అయితే, ఎప్పుడైనా సరే బరిలోకి దిగితే మాత్రం అక్కడా గొప్ప ప్రదర్శనే చూస్తాం. నేను కూడా అందుకోసమే వేచి చూస్తున్నా" అని వెంగ్‌సర్కార్ తెలిపాడు. "నేను సచిన్ అరంగేట్రం చేసినప్పటి నుంచి చూస్తున్నా. 16 ఏళ్ల వయసులోనే అతడు మానసికంగానూ పరిణతి చెందినట్లు కనిపించాడు. ఇంటర్-స్కూల్ టోర్నీల్లో అదరగొట్టి మరీ జాతీయ జట్టుకు వచ్చాడు. క్లబ్ క్రికెట్‌లోనూ మెరుగైన ఆటతీరు ప్రదర్శించాడు. అప్పటికే అతడు ఉన్నత స్థాయిలో క్రికెట్ ఆడేందుకు సిద్ధమైపోయాడు. చాలా క్రమశిక్షణతో ఉంటూ ఆటపట్ల అభిరుచి కలిగిన ప్లేయర్. వైభవ్ వంటి కుర్రాళ్లకూ సచిన్ జీవితం స్ఫూర్తి అనడంలో సందేహం లేదు. వైభవ్ మాత్రమే కాదు.. దేవదత్ పడిక్కల్, సర్ఫరాజ్ ఖాన్ వంటి ప్లేయర్లకూ అవకాశాలు ఇవ్వాలి. వారంతా మంచి నైపుణ్యం కలిగిన ఆటగాళ్లు. రాబోయే వన్డే ప్రపంచ కప్‌లో తప్పకుండా హార్దిక్ పాండ్య కీలక పాత్ర పోషిస్తాడని భావిస్తున్నా" అని వెంగ్‌సర్కార్ అన్నాడు.



## పరిస్థితులను త్వరగా అర్థం చేసుకోలేకపోయాం: అభిషేక్ శర్మ

టీ20 ప్రపంచ కప్ తర్వాత తొలిసారి పొట్టి ఫార్మాట్‌లో ద్వైపాక్షిక సిరీస్‌ను భారత్ ఆడుతోంది. తొలి మ్యాచ్‌లోనే టీమ్ఇండియాకు ఓటమి తప్పలేదు. అదీనూ ఐర్లాండ్ వంటి జట్టు చేతిలో పరాజయం చవిచూసింది. అయితే.. పరిస్థితులకు త్వరగా అలవాటు పడకపోవడం వల్లే తాము ఓడినట్లు టీమ్ఇండియా ఓపెనర్ అభిషేక్ శర్మ వ్యాఖ్యానించాడు. ఐర్లాండ్‌పై 49 పరుగులు చేసిన అభిషేక్ శర్మనే భారత్ తరఫున టాప్ స్కోరర్. "పిచ్ పరిస్థితులకు ఎంత త్వరగా అలవాటు పడుతున్నామనేదే చాలా కీలకం. ప్రస్తుత కాలంలో వరుసగా మ్యాచ్‌లు ఆడుతున్నాం. ప్రాక్టీస్ సెషన్లు దొరికినప్పుడు లేదా పరిస్థితులకు అలవాటు పడే అవకాశం ఉన్నప్పుడు జట్టుగా ముందుకు వచ్చి వాటికి అనుగుణంగా త్వరగా మారాలి. బలమైన జట్టుగా మేం పరిస్థితులకు త్వరగా సర్దుకుపోవాలి. కానీ, ఐర్లాండ్‌తో తొలి మ్యాచ్‌లో అది సాధ్యపడలేదు" అని అభిషేక్ తెలిపాడు. ఐర్లాండ్ నిర్దేశించిన 183 పరుగుల లక్ష్య ఛేదనలో సంజు శాంసన్ (5), ఇషాన్ కిషన్ (1), శ్రేయస్ అయ్యర్ (3) త్వరగానే పెవిలియన్‌కు చేరారు. మరోవైపు అభిషేక్ శర్మ మాత్రం దూకుడుగా ఆడాడు. ఏడు ఫోర్లు, రెండు సిక్స్‌ల సాయంతో 20 బంతుల్లో 49 పరుగులు చేసి పెవిలియన్‌కు చేరాడు. అయితే, 19 బంతుల్లోనే హాఫ్ సెంచరీ చేసినట్లు తొలుత వచ్చింది. కానీ, అభిషేక్ ఎదుర్కొన్న ఐదో బంతికి సింగిల్ రన్ లెగ్‌బై రూపంలో వచ్చింది. దానిని అభిషేక్ ఖాతాకు యాడ్ చేయడంతో.. అదనంగా ఒక పరుగు వచ్చి చేరింది. ఆ రన్ లేకపోవడంతో 49 పరుగులే అభిషేక్ చేసినట్లైంది.

# ప్రణాళికలకు తగ్గట్లు బౌలింగ్ చేయలేదు

## టీమిండియా టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్



మిడిల్ ఓవర్లలో ప్రణాళికలకు తగ్గట్లు బౌలింగ్ చేయకపోవడం తమ పతనాన్ని శాసించిందని టీమిండియా టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ అన్నాడు. మిడిల్ ఓవర్లలో కట్టడిగా బౌలింగ్ చేసి ప్రత్యర్థిని 140 పరుగులకు కట్టడి చేసి ఉంటే లక్ష్యాన్ని ఛేదించడం సులువయ్యేదని తెలిపాడు.రెండు టీ20ల సిరీస్‌లో భాగంగా ఐర్లాండ్‌తో శుక్రవారం జరిగిన తొలి మ్యాచ్‌లో సమష్టిగా విఫలమైన భారత్ 34 పరుగుల భారీ తేడాతో ఓటమిపాలైంది. ఈ మ్యాచ్ అనంతరం మాట్లాడిన శ్రేయస్ అయ్యర్..బ్యాటింగ్ కంటే బౌలింగ్ వైఫల్యమే తమ ఓటమికి ప్రధాన కారణమని చెప్పుకొచ్చాడు. గ్రౌండ్‌కు తగ్గట్లు బౌలింగ్ చేయాలేకపోయామని తెలిపాడు.'ఆరంభంలో మా బౌలర్లు చాలా బాగా బౌలింగ్ చేశారు. వారికి పిచ్ నుంచి స్వింగ్ లభించింది. రెండు వికెట్లు కూడా తీశారు. దాంతో మాకు అద్భుతమైన ఆరంభం దక్కింది. కానీ మిడిల్ ఓవర్లలో మా ప్రణాళికలను సరిగ్గా అమలు చేయలేకపోయాం. ఈ గ్రౌండ్ బౌండరీలు చాలా చిన్నవని తెలిసినప్పటికీ, స్ట్రెయిట్ షాట్లు ఆడేలా బంతులు వేసాం. డెత్ ఓవర్లలో మా బౌలర్లు తిరిగి పుంజుకున్నారు. మాకు లభించిన ఆరంభాన్ని బట్టి చూస్తే.. ఐర్లాండ్‌ను 140 పరుగులకు కట్టడి చేసి ఉంటే ఛేజ్ చేయడానికి సులువయ్యేది. ఫలితం ఎలా ఉన్నప్పటికీ.. ఇక్కడ ఆడటం ఒక గొప్ప అనుభవం. ఈ వాతావరణ పరిస్థితుల్లో ఆడే అవకాశం మాకు దక్కింది. పిచ్ ఎలా ఉందనే దానిపై ఒక స్పష్టమైన అవగాహన వచ్చింది. కెప్టెన్‌గా నాకైతే ఇది మంచి అనుభవమే. సుదీర్ఘ విరామం తర్వాత ఆడటం వల్ల కూడా మా జట్టు కాస్త తడబడింది. ఈ మ్యాచ్ ఫలితాన్ని వీలైనంత త్వరగా మర్చిపోయి.. తదుపరి మ్యాచ్ కోసం సిద్దమవుతాం. అయితే ఈ ఓటమి నుంచి మేం నేర్చుకోవాల్సింది చాలా ఉంది. తదుపరి మ్యాచ్‌లో సరికొత్త ఉత్సాహం,రెట్టింపు బలంతో బరిలోకి దిగుతాం.హర్షిత్ రాణా , శివమ్ దూబె అద్భుతంగా బౌలింగ్ చేశారు. పిచ్ నుంచి వారికి సహకారం లభించింది. శివం విషయానికి వస్తే.. అతను గతంలోనూ చాలా కీలకమైన ఓవర్లు వేశాడు. అందువల్ల నేను అతన్ని ఎల్లప్పుడూ సపోర్ట్ చేస్తాను. నేను దేశవాళీ క్రికెట్‌లోనూ అతనితో కలిసి ఆడాను కాబట్టి అతని బలాలు, బలహీనతలు నాకు బాగా తెలుసు. అలాగే హర్షిత్ రాణా అద్భుతంగా బౌలింగ్ చేశాడు. గాయం నుంచి కోలుకుని వచ్చి.. ఈ స్థాయిలో రాణించడం చాలా గొప్ప విషయం.క్రికెట్‌లో ఈ విషయాన్ని అంత తేలికగా తీసుకోలేం. మైదానంలోకి అడుగుపెట్టగానే మ్యాచ్‌లు గెలవడం సాధ్యం కాదు. ఇక్కడ కష్టపడాలి, ఆ క్షణంలో ఆటపైనే దృష్టి పెట్టాలి. నేను ఇంతకు ముందు చెప్పినట్లుగా.. ఎప్పుడూ ప్రస్తుతంలోనే జీవించాలి. ప్రత్యర్థిని దెబ్బతీసే అవకాశం వచ్చినప్పుడు, దాన్ని ఖచ్చితంగా ఉపయోగించుకోవాలి. ఏ ఒక్క క్షణాన్ని లేదా పరిస్థితిని కూడా ఎప్పుడూ నిర్లక్ష్యం చేయకూడదు. తదుపరి మ్యాచ్ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నాం.'అని అయ్యర్ చెప్పుకొచ్చాడు.ఈ గెలుపుతో ఐర్లాండ్ చరిత్ర సృష్టించింది. అంతర్జాతీయ క్రికెట్‌లో భారత్‌పై తొలి విజయాన్ని నమోదు చేసింది. గత 8 ప్రయత్నాల్లో దక్కని విజయం ఈ మ్యాచ్‌లో వరించింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఐర్లాండ్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 182 పరుగులు చేసింది. అనంతరం భారత్ 18.5 ఓవర్లలో 148 పరుగులకు ఆలౌటై ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. అభిషేక్ శర్మ(20 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లతో 49) రాణించగా.. మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. ఐర్లాండ్ బౌలర్లలో మ్యాట్ హోల్డ్లార్డ్(3/28), మాథ్యూ హంఫ్రేస్(3/38) మూడేసి వికెట్లతో భారత్ పతనాన్ని శాసించారు.

# పాండ్యా సీక్రెట్ మ్యారేజ్?



రత స్టార్ క్రికెటర్ హార్దిక్ పాండ్యా తన గర్ల్‌ఫ్రెండ్, ప్రముఖ మోడల్ మహికా శర్మను రహస్యంగా పెళ్లాడాడా? అంటే అవుననే అంటున్నాయి సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న సరికొత్త ఫోటోలు. వీరిద్దరూ సీక్రెట్‌గా వివాహం చేసుకున్నారంటూ నెట్టింట పెద్ద ఎత్తున ఊహాగానాలు మొదలయ్యాయి. హార్దిక్, మహికా ఇద్దరూ ఒక వృద్ధురాలితో కలిసి దిగిన ఫోటో ఆన్‌లైన్‌లోకి రావడంతో ఈ రూమర్లు ఒక్కసారిగా ఊపందుకున్నాయి.వైరల్ అవుతున్న ఆ ఫోటోను నిశితంగా గమనించిన నెటిజన్లు ఒక ఆసక్తికరమైన విషయాన్ని కనిపెట్టారు. హార్దిక్ పాండ్యాతో కలిసి ఫోటోకు పోజులిచ్చిన మహికా శర్మ నుదుటిపై 'సింధూరం' ధరించి ఉండటం అందరి దృష్టిని ఆకర్షించింది. అంతేకాకుండా, ఆ ఫోటోలో ఉన్న వృద్ధురాలు ఈ జంట చేతులను పట్టుకుని ఆశీర్వదిస్తున్నట్లుగా ఉంది. దీంతో, వీరిద్దరూ అత్యంత సన్నిహితుల మధ్య ఒక ప్రైవేట్ వేడుకలో పెళ్లి బంధంతో ఒకటయ్యారని, ఆ తర్వాతే ఈ ఫోటో దిగారని సోషల్ మీడియాలో చాలా మంది బలంగా నమ్ముతున్నారు. ఈ పెళ్లి వార్తలపై హార్దిక్ లేదా మహికా నుండి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. అయినప్పటికీ, వీరిద్దరి ఫోటోలు సోషల్ మీడియాలో విపరీతంగా షేర్ అవుతున్నాయి. కొంతకాలంగా డేటింగ్‌లో ఉన్న ఈ జంట, ఇప్పుడు తమ బంధాన్ని తదుపరి దశకు తీసుకెళ్లి జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించారని అభిమానులు ఫిక్స్ అయి-పోతున్నారు.తన మాజీ భార్య నటాషా స్టాన్‌కోవిచ్‌తో విడిపోయిన రెండేళ్ల తర్వాత.. హార్దిక్ పాండ్యా తన జీవితంలోకి వచ్చిన కొత్త మహిళగా మోడల్ మహికా శర్మను ప్రపంచానికి పరిచయం చేశాడు.గతేడాది (2025) అక్టోబర్ 10న, హార్దిక్ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో మహికాతో కలిసి బీచ్‌లో దిగిన ఒక ఫోటోను షేర్ చేశాడు. ఆ ఫోటోలో వీరిద్దరూ సముద్రతీరంలో ఎంతో ప్రశాంతంగా, సంతోషంగా కనిపించారు. హార్దిక్ ఓవర్‌సైజ్డ్ జాకెట్, షార్ట్స్ ధరించి మహికా భుజంపై చేయి వేయగా.. తెల్లటి షర్ట్ డ్రెస్‌లో ఉన్న మహికా కెమెరాకు దూరంగా చూస్తూ ఉంది. ఈ ఫోటోకు మహికా ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్‌ను ట్యాగ్ చేయడం ద్వారా హార్దిక్ తమ బంధాన్ని అధికారికంగా ప్రకటించాడు. అప్పట్లోనే ఈ జంట కెమిస్ట్రీ సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది.హార్దిక్ పాండ్యా కంటే ఏడేళ్లు చిన్నదైన మహికా శర్మ.. భారత ఫ్యాషన్ రంగంలో ఎంతో గుర్తింపు తెచ్చుకున్న మోడల్. ఆమె 'టాప్ మేగజైన్‌ల కవర్ పేజీలపై మెరిసింది. అంతేకాకుండా, ప్రతిష్టాత్మక 'ఇండియన్ ఫ్యాషన్ అవార్డ్స్'లో 'మోడల్ ఆఫ్ ది ఇయర్' అవార్డును కూడా సొంతం చేసుకుంది. తనీష్క్ , వివో , యునిక్లో వంటి ప్రముఖ బ్రాండ్ల యాడ్స్‌లో నటించిన మహికా.. తరుణ్ తహిలియాని, మనీష్ మల్హోత్రా, అనితా డోంగ్రే వంటి టాప్ డిజైనర్లు రూపొందించిన దుస్తులలో ఫ్యాషన్ షోలలో తరచూ సందడి చేస్తుంటుంది. మరి ఈ పెళ్లి రూమర్లపై హార్దిక్ పాండ్యా ఎలా స్పందిస్తాడో చూడాలి!




## భవిష్యనిధిలో 25% కనీస నిల్వ తప్పనిసరి

- ఈపీఎఫ్ ఐటీ వ్యవస్థలో కీలక మార్పులు
- జులై 1 నుంచి అమల్లోకి వచ్చేలా కార్యాచరణ

**న్యూఢిల్లీ :** ఈపీఎఫ్‌వో త్వరలో కొత్త పథకాలను అమల్లోకి తీసుకురానుంది. ఇకపై వ్యక్తిగత పీఎఫ్ ఖాతాలో 25% కనీస నిల్వను తప్పనిసరి చేయనుంది. ఉపసంహరణల పరిమితి సంఖ్యను పెంచనుంది. యూపీఐ ద్వారా నేరుగా పీఎఫ్ క్లెయిం చేసుకోవడంతోపాటు ఆటోమేషన్‌లో వేగంగా ఆమోదం లభిస్తే వెంటనే ఆ నగదు సత్వరమే బ్యాంకు ఖాతాలో జమయ్యేలా మార్పులు చేస్తోంది. ఈ మేరకు ఈపీఎఫ్‌వో కేంద్రీకృత ఐటీ వ్యవస్థలో సమూల మార్పులు తీసుకువస్తోంది. ఈపీఎఫ్‌వో పాస్‌బుక్, మెంబర్ పోర్టల్, యాజమాన్యాల పోర్టల్‌తోపాటు వెబ్‌సైట్‌ను ఈ నెల 30 వరకు మూసివేసి, క్లెయిం పరిష్కార వ్యవస్థను నిలిపివేసింది. ప్రస్తుతమున్న వెబ్‌సైట్‌ను ఆధునికీకరించడంతోపాటు క్లెయిం పరిష్కారానికి ఆటోమేషన్ వ్యవస్థను అప్‌గ్రేడ్ చేస్తోంది. కొత్త వెబ్‌సైట్, క్లెయిం వ్యవస్థ, నూతన పథకాలు, ఐటీ వ్యవస్థలను జులై 1 నుంచి అమల్లోకి తీసుకురానున్నట్లు సమాచారం. ఐటీ వ్యవస్థ అప్‌గ్రేడేషన్‌లో భాగంగా.. ఉద్యోగులకు 2025-26 ఏడాదికి నిర్ణయించిన 8.25% వడ్డీని ఈ నెల 30లోగా ఖాతాల్లో జమ చేయనుంది. జులై 1న వడ్డీ జమతో కూడిన నగదు నిల్వల వివరాలు వెల్లడించనుంది. ఉద్యోగులు, కార్మికుల వ్యక్తిగత ఈపీఎఫ్ నిధిలో కనీసం 25% నిల్వ ఉంచి మిగిలిన మొత్తాన్ని మాత్రమే ఉపసంహరించుకునేలా ఇప్పటికే సీబీటీ ఆమోదం తెలిపింది. తరచూ ఉపసంహరణలతో కార్మికులకు పదవీ విరమణ సమయంలో చేతిలో నిధులు ఉండటం లేదని గుర్తించింది. చేతికి రూ.20 వేలు కూడా రాని కార్మికుల సంఖ్య ఎక్కువ ఉన్నట్లు అధ్యయనంలో వెల్లడైంది. ఈ నేపథ్యంలో పదవీ విరమణ తర్వాత కార్మికులు గౌరవప్రదమైన జీవనం కొనసాగించేందుకు వీలుగా 25% కనీస నిల్వగా నిర్ణయించింది. అంటే.. ప్రతి ఉద్యోగి క్లెయిం దరఖాస్తు నాటికి ఉద్యోగి, యజమాని వాటాలు, ఆ మొత్తంపై వడ్డీ కలపగా వచ్చేది మొత్తం భవిష్యనిధి నిల్వ అవుతుంది. అందులో కనీస నిల్వ ఉంచి.. మిగతా మొత్తం నుంచి మాత్రమే ఉపసంహరణలకు అనుమతిస్తారు. ఇంతవరకు కనీస నిల్వ నిర్వహించాలనే నిబంధన లేదు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా ఉద్యోగుల భవిష్య నిధి(ఈపీఎఫ్)-2026, ఉద్యోగుల పింఛను పథకం(ఈపీఎస్)-2026 పథకాలను అమల్లోకి తీసుకురానుంది. ఈపీఎఫ్-1952, ఈపీఎస్-1995 పథకాల స్థానంలో ఇవి రానున్నాయి. ఇటీవల జరిగిన ఈపీఎఫ్‌వో కేంద్ర ట్రస్టీ బోర్డు ఇందుకు ఆమోదం తెలిపింది. న్యాయశాఖ పరిశీలనలో ఈ పథకాలు పెండింగ్‌లో ఉన్నాయి. కొత్త ఐటీ వ్యవస్థతోపాటు ఈపీఎఫ్, ఈపీఎస్-2026 పథకాలను నోటిఫై చేసే అవకాశాలున్నట్లు కార్మిక వర్గాలు పేర్కొంటున్నాయి.

## ఓపెన్ ఏఐ భారత్ ఎండీగా ప్రభ్‌జీత్ సింగ్

ఏఐ మార్కెట్ విస్తృతమవుతోన్న వేళ.. శామ్ ఆల్ట్‌మన్ నేతృత్వంలోని ఓపెన్ ఏఐ తన కార్యకలాపాలను మరింత ముమ్మరం చేస్తోంది. భారత్‌లో ఆ సంస్థ పగ్గాలను ప్రభ్‌జీత్ సింగ్‌కు అప్పగించాలని నిర్ణయించింది. సెప్టెంబర్‌లో భారత్ ఓపెన్ ఏఐ మెనేజింగ్ డైరెక్టర్‌గా ఆయన బాధ్యతలు చేపడతారని కంపెనీ ఓ ప్రకటనలో పేర్కొంది. ఓపెన్ ఏఐకు భారత్ ఓ కీలక మార్కెట్ అని ఇప్పటికే శామ్ ఆల్ట్‌మన్ విశ్వసిస్తున్నారు. ఈ క్రమంలో ఇక్కడ తమ ఉనికిని మరింత విస్తరించాలనే లక్ష్యంతో ప్రభ్‌జీత్ సింగ్‌ను ఎండీగా నియమించినట్లు తెలుస్తోంది. కంపెనీ కన్స్యూమర్ గ్రోత్, ఎంటర్‌ప్రైజ్ అడాప్షన్, వ్యూహాత్మక భాగస్వామ్యాల రెగ్యులేటరీ వ్యవహారాలను ఆయన పర్యవేక్షించనున్నారు. సింగ్ నేతృత్వంలో భారత్ వినియోగదారులకు, వ్యాపారులు, ప్రభుత్వ కార్యకలాపాలకు ఓపెన్ ఏఐ ద్వారా మరిన్ని ప్రయోజనాలు అందుతాయని కంపెనీ విశ్వసిస్తోంది. కాగా, ఓపెన్ ఏఐ తన కంపెనీ తొలి ఆఫీస్‌ను దిల్లీలో 2025లోనే ఏర్పాటుచేసింది. ప్రభ్‌జీత్ సింగ్ ఉబర్‌లో 11 ఏళ్లపాటు సీనియర్ ఎగ్జిక్యూటివ్‌గా విధులు నిర్వహించారు. ఆయన రాజీనామాను ఉబర్ కూడా ప్రకటించింది. భవిష్యత్తు ప్రయోజనాల దృష్ట్యా ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఓపెన్ ఏఐ పేర్కొంది.

జనం వార్త

# భాగ్యారాజ్ మృతికి పలువురు ప్రముఖుల సంతాపం

### నమ్మలేకపోతున్నామన్న చిరు, వెంకటేశ్, రాధిక, సుహాసిని

ప్రముఖ దర్శకుడు, నటుడు కె.భాగ్యరాజ్ మృతి పట్ల నటులు చిరంజీవి, వెంకటేశ్, రాధిక, సుహాసిని వంటి స్టార్లు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఆయన చివరి వీడియో నెట్టింట వైరల్ అవుతుంది. గురువారం ఆయన నటి కుష్బూ కూతురు పెళ్లికి హాజరయ్యారు. అక్కడి చిరంజీవి, వెంకటేశ్, నాగార్జునల తో సరదాగా సంభాషించారు. వారితో కలిసి వేదికపైకి వెళ్లి వధూవరులను ఆశీర్వదించారు. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. అలాగే పలువురు సినీతారలు కూడా భాగ్యరాజ్‌కు నివాళులు అర్పిస్తూ వీడియోలు పోస్ట్ చేశారు. 'నేను 50 ఏళ్ల క్రితం పరిచయం చేసిన కె.భాగ్యరాజ్ ఈరోజు లేదనే వార్త తీవ్ర వేదనకు గురిచేసింది. తమిళ చిత్ర పరిశ్రమ ఒకే నెలలో ఇద్దరు రాజుల్ని కోల్పోయింది' అని విశ్వనాయకుడు కమల్‌హాసన్ ట్వీట్‌లో పేర్కొన్నారు. 'భాగ్యరాజ్ నాకు మంచి స్నేహితుడు. ఇప్పుడు ఆయన మన మధ్య లేరనే విషయాన్ని నమ్మలేకపోతున్నా' అని సుమన్ పేర్కొన్నారు. '

# 'గేమ్ ఛేంజర్' పోస్ట్‌మార్టం..

### ఫ్లాప్‌నకు అసలు కారణాలు చెప్పిన దిల్‌రాజు

స్టార్ హీరో రామ్‌చరణ్ కథానాయకుడిగా విజనరీ దర్శకుడు శంకర్ దర్శకత్వంలో వచ్చిన పొలిటికల్ యాక్షన్ డ్రామా 'గేమ్ ఛేంజర్'. దిల్‌రాజు నిర్మించిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద ఆశించిన విజయాన్ని అందుకోలేదు. ఇదే విషయాన్ని ఆయన కూడా అంగీకరించారు. తాజా ఇంటర్వ్యూలో 'గేమ్ ఛేంజర్' ఆశించిన స్థాయిలో ఆడకపోవడానికి గల కారణాలను కూడా వెల్లడించారు. కేవలం నాలుగు పాటలకు రూ.75 కోట్లు ఖర్చు చేయడం సమంజసమా?అది మిస్‌ఫైర్ అయిందా? అని అడగ్గా.. దిల్‌రాజు వివరణ ఇచ్చారు. "దర్శకుడు శంకర్ సినిమాల్లో పాటలు చాలా స్పెషల్. 'సినిమా అంతా సాధారణంగా తీసినా.. పాటలు ఒక్కోటి, ఒక్కో విధంగా డిజైన్ చేస్తాను' అని ఆయన చెప్పారు. ఆయన పాటలను ఎలా తీస్తారో మనందరికీ తెలుసు. గత సినిమాల్లోనూ చూశాం. ఇక్కడ జరిగింది ఏంటంటే.. మూవీ కంటెంట్ ప్రేక్షకులను మెప్పించనప్పుడు పాటలు ఎంత అద్భుతంగా తీసినా ఉపయోగం లేదు. 'గేమ్ ఛేంజర్' విషయంలో అదే జరిగింది. ఒకవేళ కంటెంట్ సూపర్‌గా ఉండి, ఆడియో సూపర్‌హిట్ అయితే, అది సినిమాకు అదనపు బలం. అలా జరగనప్పుడు సినిమాకు నష్టమే. సినిమా షూటింగ్ కూడా సుదీర్ఘంగా సాగింది. ఎన్నికలు అయి-పోయిన తర్వాత వచ్చిన మూవీ కావడంతో కంటెంట్ ప్రేక్షకులకు కనెక్ట్ కాలేదు. స్టోరీలో కొత్తదనం లేక, 'ఇది ఎక్కడో చూసినట్లు ఉందే' అని చాలా మందికి అనిపించింది" అని చెప్పుకొచ్చారు.




# తమిళచిత్ర పరిశ్రమలో మరో విషాదం

### నటుడు, దర్శకుడు భాగ్యరాజ్ హఠాన్మరణం



తమిళ చిత్ర పరిశ్రమలో మరో విషాదం చోటుచేసుకుంది. ప్రముఖ నటుడు, దర్శకుడు కె.భాగ్యరాజ్(73) కన్నుమూశారు. గుండెపోటుతో శనివారం ఉదయం చెన్నైలో తుదిశ్వాస విడిచారు. తమిళ, తెలుగు భాషల్లో 75కు పైగా చిత్రాల్లో ఆయన నటించారు. 25 సినిమాలకు దర్శకత్వం వహించారు. అంతేకాదు.. సంగీత దర్శకుడిగా సింగర్‌గా కూడా ఆయన అలరిం చారు. చివరిగా ఆయన '35 చిన్న కథ కాదు', శేఖర్ కమ్ముల దర్శకత్వం వహించిన 'కుబేర' చిత్రంలో సాధు పాత్రలో కనిపించారు. తమిళనాడులోని ఈరోడ్ జిల్లా వెల్లాంకోయిల్‌లో ఆయన జన్మించారు. 1981లో నటి ప్రవీణను వివాహం చేసుకున్నారు. కామెర్ల వ్యాధితో ఆమె 1983లో మరణించారు. ఆ తర్వాత 1984లో పూర్ణిమ జయరామ్‌ను పెళ్లాడారు. వీరిద్దరికీ ఇద్దరు సంతానం. కొడుకు శంతను భాగ్యరాజ్ హీరోగా చేస్తున్నారు. కూతురు శరణ్య 'పారిజాతం' వంటి కొన్ని సినిమాల్లో హీరోయిన్‌గా నటించారు. ప్రముఖ దర్శకుడు భారతీరాజా వద్ద '16 వయదినిలే' (తెలుగులో పదహారేళ్ల వయసు) చిత్రానికి సహాయ దర్శకుడిగా కెరీర్ ప్రారంభించారు భాగ్యరాజ్. ఆ సినిమాలో ఒక చిన్న పాత్రలోనూ మెరిశారు. 1979లో 'సువరిల్లాద చిత్రంగళ్' సినిమాతో దర్శకుడిగా మారారు. ఆ తర్వాత హీరోగా, దర్శకుడిగా ఆయన చేసిన ప్రయోగాలన్నీ సక్సెస్ అయ్యాయి. 'అన్థా 7 నాట్కళ్' (రాధా కళ్యాణం), 'ముంధానై ముడిచ్చు' (మూడు ముళ్లు), 'దూరల్ నిన్ను పోచ్చు' వంటి చిత్రాలు బ్లాక్‌బస్టర్స్‌గా నిలిచాయి. తమిళంలో ఆయన రూపొందించిన ఎన్నో కథలు తెలుగు, హిందీ భాషల్లోకి రీమేక్ అయ్యాయి. అమితాబ్ బచ్చన్ నటించిన 'ఆఖరి రాస్తా' చిత్రానికి కథ, స్క్రీన్ ప్లే భాగ్యరాజ్ అందించడం

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'రాకా' గురించి ప్రస్తుతం సోషల్ మీడియాలో ఒక క్రేజీ అప్‌డేట్ తెగ హల్‌చల్ చేస్తోంది. 'పుష్ప', 'పుష్ప 2' చిత్రాలతో ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాసిన అల్లు అర్జున్, రష్మిక మందన్న హిట్ కాంబో ఈ సినిమాతో మరోసారి రిపీట్ కాబోతున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో బల మైన వార్తలు వినిపిస్తున్నాయి. అయితే ఈసారి వీరిద్దరి కాంబినేషన్ మరింత విభిన్నంగా ఉ ండబోతోందని సమాచారం. ఇప్పటివరకు బన్నీతో కేవలం రొమా న్స్ చేసిన రష్మిక, ఈ సినిమాలో సరికొత్తగా నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపించ బోతుందని ప్రచారం

# రాకాలో పవర్‌ఫుల్ రోల్‌లో రష్మిక

### నెగెటివ్ షేడ్‌లో ఉంటుందని ప్రచారం

సాగుతోంది. కథను పూర్తిగా మలుపు తిప్పే ఒక కీలకమైన పాత్ర కోసం దర్శకుడు అట్లీ ఆమెను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ముంబైలో జరుగుతున్న భారీ యాక్షన్ షెడ్యూల్‌లో రష్మిక కూడా జాయిన్ అయినట్లు బాలీవుడ్ వర్గాల సమాచారం. 'పుష్ప' సిరీస్ బ్లాక్‌బస్టర్ హిట్ అవ్వడంతో అల్లు అర్జున్‌కి రష్మిక ఒక 'లక్కీ చార్మ్' అని, అందుకే ఆమెను ఈ ప్రాజెక్ట్‌లోకి తీసుకున్నారని ఫ్యాన్స్ భావిస్తున్నారు. కాగా, ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె ప్రధాన నాయికగా నటిస్తుండగా, రష్మికతో పాటు మృణాల్ ఠాకూర్, జాన్వీ కపూర్ కూడా కీలక పాత్రలు పోషిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు బాలీవుడ్ కింగ్ ఖాన్ షారుక్ ఖాన్ కూడా ఈ సినిమాలో ఒక పవర్‌ఫుల్ క్యామియో రోల్‌లో మెరవనున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ క్రేజీ తారాగణంతో అంచనాలను పెంచేస్తున్న ఈ ప్రాజెక్ట్‌పై చిత్ర యూనిట్ నుండి త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.



# ఇడుపు కాయితం
# సినిమా టైటిల్‌పై రచ్చ

### టైటిల్ మార్చేది లేదన్న దర్శకుడు బన్నీవాసు

ఒక సినిమా విడుదలైన తర్వాత అందులోని పాత్రలు, సన్నివేశాలు, సంభాషణలపై చర్చ.. వివాదాలకు దారి తీయడం ఇప్పటివరకూ చూశాం. ఇటీవల కాలంలో టైటిల్‌తోనే చర్చకు దారితీసిన మూవీ 'ఇడుపు కాయితం'. సోషల్ మీడియాలో పనిగట్టుకుని కొందరు పెట్టిన పోస్టులు వివాదానికి దారితీశాయి. సినిమా భాష, యాస, టైటిల్స్ విషయంలో రెండు వర్గాలుగా విడిపోయి.. ఒకరిపై ఒకరు ఆరోపణలు, విమర్శలకు దిగారు. ఈ క్రమంలో చిత్ర నిర్మాత బన్ని వాస్ స్పందించారు. ఇది ఒక ప్రాంతానికి పరిమితమయ్యే కథ కాదని, కథను బట్టే టైటిల్ ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం వివాదం నేపథ్యంలో టైటిల్, కథను మార్చే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. ఏ సినిమాకైనా కథ, దాని నేపథ్యం బట్టే టైటిల్ ఉంటుంది. దీనిపై ఇక చర్చ అనవసరం. షూటింగ్ పూర్తయి విడుదలైన తర్వాత సినిమానే మాట్లాడుతుంది. ఆంధ్రా, తెలంగాణ ఎవరైనా సరే సినిమా నచ్చితేనే చూస్తారు. నచ్చకపోతే చూడరు. నేను చేయాల్సింది సినిమాను బాగా తీయడంపై దృష్టి పెట్టడమే. ప్రస్తుతం ఈ వివాదం వల్ల సినిమాకు కొంత ఇబ్బంది కలిగిన మాట వాస్తవం. రేపు సినిమా బాగుంటే అన్నీ సర్దుకుంటాయి. ఇది ఒక ప్రాంతానికి పరిమితమయ్యే కథ కాదు. నాకు పూర్తి నమ్మకం ఉంది. దర్శకుడు వచ్చిన ప్రాంతం, చూసిన వాస్తవ సంఘటనల నుంచి రాసుకున్న కథ ఇది అన్నారు. ప్రియదర్శి, నాగదుర్గ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ మూవీకి వంశీరెడ్డి దొండపాటి దర్శకుడు. ఇడుపు కాయితం అంటే విడాకుల పత్రం.. భార్యాభర్తలు విడిపోవడానికి పెద్దల సమక్షంలో కుదుర్చుకున్న ఒప్పంద పత్రం. ఇప్పుడు దంపతులు విడిపోవాలనుకుంటే కోర్టులు చుట్టూ తిరుగుతున్నారు. కానీ, కొద్ది కాలం కిందట కలిసి బతకలేమని నిర్ణయించుకున్న దంపతులు పెద్ద మనుషుల సమక్షంలో విడిపోవడానికి ఒక ఒప్పందం చేసుకునే వారు. దీన్నే ఇడుపు కాయితం అని పిలిచేవారు. ఇప్పటికీ తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లో




ఇడుపు కాయితం రాసుకొని విడిపోతున్న జంటలున్నాయి. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఎక్కువగా వినిపిస్తున్న పదాల్లో 'ఇడుపు కాయితం' ఒకటి. ప్రియదర్శి హీరోగా తెరకెక్కుతున్న కొత్త సినిమా టైటిల్‌గా ఈ పదాన్ని ప్రకటించిన తర్వాత దీనిపై పెద్ద ఎత్తున చర్చ మొదలైంది. కొందరు ఈ పదానికి అర్థం ఏమిటని వెతుకుతుండగా, మరికొందరు దీనిపై సోషల్ మీడియాలో చర్చలు, వాదోపవాదాలు మొదలుపెట్టారు. దీంతో 'ఇడుపు కాయితం' అనే పదం ఒక్కసారిగా ట్రెండింగ్‌లోకి వచ్చింది.

# 29న ఇరుముడి కట్టు పాట విడుదల

మాస్ మహారాజా రవితేజ కథానాయకుడిగా టాలెంటెడ్ డైరెక్టర్ శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న డివోషనల్ డ్రామా 'ఇరుముడి'. మైత్రీ మూవీ మేకర్స్, టి-సిరీస్ సంయుక్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన క్రేజీ అప్‌డేట్‌ను చిత్ర బృందం ప్రకటించింది. ఈ సినిమా నుంచి మొదటి పాట 'ఇరుముడి కట్టు' పాటను జూన్ 29వ తేదీన ఉదయం 11:07 గంటలకు విడుదల చేయబోతున్నట్లు ప్రకటించింది. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని ఈ ఆగస్ట్ 21న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ కథానాయికగా నటిస్తుండగా, సాయి కుమార్, బేబీ నక్షత్ర, విష్ణుశర్మ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమాలో రవితేజ సరికొత్త డివోషనల్ లుక్‌లో కనిపించనున్నారు. ఒక తండ్రి, కూతురి మధ్య ఉండే ఎమోషనల్ బాండింగ్, అయ్యప్ప స్వామి మాల ధారణ ద్వారా ఒక వ్యక్తి జీవితంలో వచ్చే ఆధ్యాత్మిక మార్పుల చుట్టూ ఈ కథ తిరగనుంది. రవితేజ కెరీర్‌లోనే ఇదొక విభిన్నమైన చిత్రంగా నిలవబోతోంది.




# మైత్రీ మూవీ మేకర్స్‌లో నవీన్ పోలిశెట్టి

టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో నవీన్ పోలిశెట్టి తన తదుపరి క్రేజీ ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించేందుకు సర్వం సిద్ధం చేసుకున్నాడు. 'అనగనగా ఒక రాజు' చిత్రంతో బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకోవడమే కాకుండా, వంద కోట్ల క్లబ్‌లో చేరి తన మార్కెట్ స్టామినాను నిరూపిం చుకున్న నవీన్.. తన కొత్త సినిమాను లైన్‌లోపెట్టాడు. అగ్ర నిర్మాణ సంస్థ అయిన మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించబోతుంది. నవీన్ పోలిశెట్టి మార్కెట్ పరిధిని దృష్టిలో ఉంచుకుని ఈ కలయికపై మైత్రీ సంస్థ చాలా నమ్మకంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన రాకముందే నవీన్ పోలిశెట్టి సోషల్ మీడియా వేదికగా చేసిన ఒక వినూత్న ప్రమోషన్ ప్రస్తుతం నెట్టింట సంచలనంగా మారింది. సినీ ఇండస్ట్రీలోని నలుగురు టాప్ కమర్షియల్ డైరెక్టర్స్ ప్రశాంత్ నీల్, సుకుమార్, లోకేష్ కనగరాజ్, మరియు రిషబ్ శెట్టిలతో కలిసి దిగిన ఒక అదిరిపోయే ఫన్నీ రీల్‌ను ఆయన షేర్ చేశాడు. ఈ దర్శకుల సినిమాల బాక్సాఫీస్ వసూళ్లను ఉద్దేశిస్తూ.. దీనిని తన కెరీర్‌లోనే అత్యంత ఖరీదైన 'రూ. 5000 కోట్ల ఫ్రేమ్' అని నవీన్ చమత్కరించాడు. ఈ వైరల్ వీడియో ద్వారా మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌లో తన తదుపరి చిత్రం రాబోతోందని నవీన్ క్లారిటీ ఇచ్చాడు. దీనికి స్పందనగా మైత్రీ మూవీ మేకర్స్ కూడా నవీన్‌ను తమ ప్రొడక్షన్ ఫ్యామిలీలోకి ఆహ్వా నిస్తూ.. ఒక ఫుల్-ఆన్ ఎంటర్‌టైనర్ లోడింగ్ అవుతోందని వెల్లడించింది. అయితే ఈ సరికొత్త ప్రాజెక్ట్‌ను పూర్తి స్థాయి క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కించ నున్నారు. 'సైరన్' సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న తమిళ దర్శకుడు ఆంటోనీ భాగ్యరాజ్ ఈ చిత్రానికి దర్శకత్వం



వహించనున్నట్లు సినీ వర్గాల్లో గట్టి ప్రచారం సాగుతోంది. ప్రస్తుతం స్క్రిప్టింగ్, ప్రీ-ప్రొడక్షన్ పనులను వేగవంతం చేసిన చిత్ర బృందం, త్వరలోనే షూటింగ్‌ను ప్రారంభించి, వచ్చే ఏడాది ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి ప్లాన్ చేస్తోంది. నవీన్ పోలిశెట్టి అద్భుతమైన కామిక్ టైమింగ్, ఆంటోనీ భాగ్యరాజ్ టేకింగ్, మరియు మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణ విలువల కలయికలో రాబోతున్న ఈ చిత్రంపై ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్నాయి.

PUBLISHED AND OWNED BY **DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS** 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500083.,**EDITOR : DUSARI RAVINDER GOUD, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132**, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com